## ఘనంగా రెండో సోమవారం కార్తీక దీపారాధన

కాణిపాకం, నవంబర్ 11 ప్రభాతవార్త: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో కార్తీక మాసం రెండో సోమవారం కార్తీక దీపారాధన అత్యంత ఘనంగా నిర్వహించారు. కార్తీకమాసం శివునికి అత్యంత ప్రీతిపాత్రమైన మాసం. కార్తీకమాసంలో ప్రతి సోమవారం శివాలయాలలో దీపాలను వెలిగించి మహిళలు మొక్కులు తీర్చుకుంటుంటారు. శ్రీమణికంఠేశ్వరాలయంలో ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అలాగే ఆలయ ప్రాంగణంలోని ఉసిరి,మారేడు చెట్టుకింద మహిళలు ఉదయం నుండి రాత్రి వరకు దీపాలువెలిగించి

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆకాశ దీపం

శ్రీకాళహస్తి,నవంబర్ 11 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీక మాసం సందర్భంగా ఆలయ ఆవరణలో ప్రతి రోజూ ఆకాశదీపాన్ని వెలిగిస్తున్నారు. స్వామి కంచుగడప ఎదురుగా కోట మండపం నిర్మించారు.ఇక్కడ కార్తీక మాసంలో నిత్యం స్వామి వారికి దీపంతో ఆరాధించే సంప్రదాయం ఉంది. ఈ నేపథ్యంలో సోమవారం ఆలయ ఆవరణలో ఎఇఒ లోకేష్‌రెడ్డి వేదపండితులు వేదపండితులు వేద మంత్రాలను పఠిస్తుండగా శాస్త్రోక్తంగా ఆధిరోహింపజేసారు. ఈకార్యక్రమాల్లో టెంపుల్ ఇన్స్పెక్టర్ హరియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# అకృత్యాల నీడలో అరాచక లాఠీ రాజ్యం!

### అవమానాలతో మనోవేదనకు గురవుతున్న మహిళలు- బాధితుల గోడు పట్టని ఖాకీలు- చిట్టమూరు పోలీసుల తీరిది

అక్రమాలకు నిలయంగా చిట్టమూరు పోలీసుస్టేషన్
చిట్టమూరు ఎస్ఐ

చిట్టమూరు, నవంబర్ 11 ప్రభాతవార్త
అకృత్యాల నీడలో అరాచక లాఠీ రాజ్యమేలుతోంది. అభాగ్యులకు అండగా ఉండాల్సిన పోలీసులు కొందరు అరాచక ఖాకీలుగా మారి వృత్తి ధర్మాన్ని విస్మరించి అంతా నా ఇష్టం అన్నట్లుగా వృత్తికి కళంకం తెస్తున్నారు. భయోత్పాతం సృష్టించి అభాగ్యులైన బాధితులకు చుక్కలు చూపిస్తున్నారు. అరాచకాలు,అకృత్యాలతో అమాయకులైన మహిళలు తమకు జరిగిన అన్యాయం ఎవరికి చెప్పుకోవాలో తెలియక మనోవేదను గురై నిత్యం నరకం అనుభవిస్తూ అవమానాలు ఎదుర్కొంటున్నారు. చిట్టమూరు మండలంలో జరిగిన కొన్ని సంఘటనలు ఇందుకు తార్కాణంగా నిలిచాయి. బాధితులు, స్థానికులు కొందరు అందించిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. దరకాస్తు గ్రామానికి చెందిన చల్లా దేవసేన అనే వివాహితను చేయని తప్పుకు పోలీసుల నిర్లక్షం కారణంగా రెండునెలలు జైలు జీవితం అనుభవించి ప్రస్తుతం బెయిల్‌పై ఇంటికి వచ్చి దుర్భర జీవితం అనుభవిస్తోంది. గత మూడు నెలల క్రితం దేవసేన భర్త చెంగయ్య ఓ సెల్ఫీ వీడియో తీసి పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా, కుటుంబ సభ్యులు, భార్య సకాలంలో స్పందించడంతో 15రోజులు తిరుపతిలోని రుయా ఆసుపత్రిలో చికిత్స అనంతరం ప్రాణాలతో బయటపడ్డాడు. అయితే ఇంటికి వచ్చిన తర్వాత జరిగిన వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా తన చిన్నాన్న, మరొకరితో కలిసి మద్యం సేవించిన చెంగయ్య రాత్రంతా ఉత్సవాల్లో అలిసిపోయేలా ఆడాడు. భార్య ఎంత చెప్పినా వినకుండా మద్యం సేవించడంతో పరిస్థితి మరోమారు అదుపుతప్పి నెల్లూరులో చికిత్స పొందుతూ మృతిచెందాడు. చెంగయ్య మొదట పురుగు మందు తాగి సెల్ఫీ వీడియో రిలీస్ చేసిన అనంతరం సామాజిక మాధ్యమాల్లో వచ్చినప్పటికీ స్పందించిన పోలీసు యంత్రాంగం చెంగయ్య మృతిచెందిన తర్వాత మాత్రమే కేవలం సెల్ఫీ వీడియోలో తన చావుకు భార్య దేవసేన, మరో వ్యక్తి కారణమని చెప్పిన విషయాన్ని మాత్రమే సాక్షంగా తీసుకున్న పోలీసులు ఎలాంటి విచారణ జరపకుండా.. వాస్తవాలు తెలిసినా వాటిని తొక్కిపెట్టి ఓ అమాయకురాలిని జైలుకు పంపారు. ఓ వ్యక్తి తన మరణానికి కారకులెవరో చెప్పినప్పుడు సదరు వ్యక్తి ఆసుపత్రిలో చేరి 15 రోజులు చికిత్స పొందినా అతని వాంగ్మూలం తీసుకోని పోలీసులు ఉద్దేశపూర్వకంగానే ఆమెను జైలుకు పంపడంలో ఇక్కడ పోలీసు వ్యవస్థ ఏ విధంగా దిగజారిందో అనే ఆరోపణలు మండల ప్రజల నుంచి అప్పట్లో జోరుగా వినిపించాయి. దీంతో పాటు జైలు నుంచి ఇంటికొచ్చిన బాధిత మహిళ తన కుటుంబ సభ్యులతో పాటు మరో వ్యక్తి అయిన రెండు హత్యలు, ఓ కిడ్నాప్ కేసులో ఉన్న వ్యక్తి నిన్ను చంపేస్తా.. నీ అంతు చూస్తా అంటూ బాధితురాలిని బెదిరించడంతో పాటు తన భర్త డెత్ సర్టిఫికెట్ అతని వద్ద పెట్టుకొని తనకు ఇవ్వకుండా పలు ప్రభుత్వ పథకాలు తనకు రానివ్వకుండా చేస్తున్న వైనాన్ని గత 15 రోజుల క్రితం చిట్టమూరు బాధిత మహిళ దేవసేన కన్నీరుమున్నీరుగా విలపించి ఫిర్యాదు చేసింది. అయితే బాధితురాలికి ఎస్ఐ సలహా ఇస్తూ, నువ్వు మరోమారు వారిపై ఫిర్యాదు చేసినా, నోరు చేసుకున్నా నీ బెయిల్ రద్దయి శాశ్వతంగా జైల్లోనే ఉంటావంటూ బాధితురాలిని బెదిరించడంతో తన బాధ ఎవరికి చెప్పాలో అర్థంకాక తన ఇంట్లో కూడా తనను ఉండనివ్వకుండా చేస్తుండటంతో కూలీ పనులు చేసుకుంటూ పరాయివారి ఇళ్లలో తలదాచుకుంటూ కాలం వెళ్లదీస్తోంది. అలాగే యల్లసిరి గ్రామానికి చెందిన వాటంబేటి నాగమ్మ అనే వితంతువు తన తమ్ముడు వాటంబేటి ధనంజయ తన ఆస్తిని అమ్ముకుంటూ తన ఇంట్లో నుంచి తననే గెంటేశాడని, న్యాయం చేయాలని పోలీసులకు మొరపెట్టుకున్నా బాధితురాలి మొర పెడచెవిన పెట్టి తీరని అన్యాయం చేశారని నాగమ్మ విలపిస్తోంది. చిట్టమూరు పోలీసుస్టేషన్‌లో న్యాయం, ధర్మం వైపు పోలీసులు నిలబడకపోగా, అక్రమాలు, నగదు వంటివాటికే ప్రాధాన్యత ఇస్తూ పోలీసు వ్యవస్థను దిగజారుస్తుండటం పట్ల రానురాను ప్రజల్లో పోలీసుల పట్ల నమ్మకం సన్నగిల్లుతోంది. చిట్టమూరులో గతంలో ఎన్నడూ లేనివిధంగా మట్టి, గ్రావెల్, ఇసుక, కోడిపందేలు, బెల్టుషాపులు విచ్చలవిడిగా సాగుతున్నా పోలీసుస్టేషన్ బాస్ లంచావతారిగా మారి బాధితుల నోట్లో మట్టికొడుతున్నారన్న ఆరోపణలు మండల ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. అలాగే మండటంలో ఎస్సీ, ఎస్టీ కేసులు, భూవివాదాల పట్ల పోలీసులను ఆశ్రయించినా బాధితులకు న్యాయం జరగడం లేదు. దీంతో కొంతమంది సోమవారం కుమ్మరిపాలెం నుంచి హరి, బురదగాలి కొత్తపాలెం నుంచి సుబ్రహ్మణ్యం అనే బాధితులు తన భూమిని కబ్జా చేశారంటూ ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని జిల్లా పోలీసు బాస్‌కు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అలాగే మల్లాం గ్రామానికి చెందిన ఓ మహిళ తన భర్త, అత్తామామలు వేధిస్తున్నారని స్థానిక ఎస్ఐ ముందు మొరపెట్టుకున్నా నిర్లక్షంగా వ్యవహరించిన తీరు పట్ల బాధితురాలు సైతం జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసిన విషయం తెలిసింది. జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు చిట్టమూరులో బాధితులకు జరుగుతున్న అన్యాయాన్ని గుర్తెరిగి వారికి భరోసా కల్పించడంతో పాటు దేవసేన లాంటి అభాగ్యులకు అండగా నిలిచి, అభాగ్యులపై పెత్తనం చలాయిస్తున్న చిట్టమూరు పోలీసులను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని పలువురు కోరుతున్నారు.

### సైబర్ క్రైమ్ నేరాలపై

## సమిష్టిగా పోరాడుదాం

### జిల్లా ఎస్పీ, కలెక్టర్, మహిళ విశ్వవిద్యాలయం ఉపకులపతి

తిరుపతి కార్పొరేషన్, నవంబర్ 11, ప్రభాతవార్త
సమిష్టి కృషితో సైబర్ నేరాలపై పోరాడుదామని జిల్లా ఎస్పి సుబ్బరాయుడు, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, మహిళ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఉమాలు పేర్కొన్నారు. సోమవారం స్థానిక శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ ఐఏఎస్., జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఐపీఎస్., మహిళా విశ్వవిద్యాలయ ఉపకులపతి వి.ఉమ వారితో కలిసి సైబర్ క్రైమ్, డ్రగ్స్, క్రైమ్ అగైనెస్ట్ ఉమెన్ అండ్ చిల్డ్రన్ పై అవగాహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమానికి మంగళగిరి డిజిపి కార్యాలయం నుండి రాష్ట్ర గౌరవ డి.జి.పి సి.హెచ్. ద్వారకా తిరుమలరావు హాజరయ్యారు. వర్చువల్ విధానంలో గౌరవ డిజిపి సి.హెచ్. ద్వారకా తిరుమల రావు మాట్లాడుతూ 900 పాఠశాల కళాశాలలో నుంచి సుమారు 60 వేల మంది విద్యార్థులు జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఒకే వేదిక పైకి వచ్చి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం ఒక అరుదైన కార్యక్రమం అన్నారు. ప్రస్తుత రోజుల్లో సైబర్ క్రైమ్ ద్వారా నేరాలు పెరిగిపోతున్నాయని, వీటిని కట్టడి చేయాల్సిన అవసరం సమాజంలోని అందరిపై ఉందని తెలిపారు. సైబర్ క్రైమ్ ద్వారా వందల కోట్ల రూపాయలలో ఆర్థికంగా నష్టపోతున్న బాధితులు ఎంతోమంది ఉన్నారని తెలిపారు. సైబర్ నేరగాళ్ల వలలో పడి మోసపోవద్దని, మొబైల్ ఫోన్ లకు వచ్చే ఎస్ఎంఎస్ ఓటిపిలపై జాగ్రత్త వహించేలా అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. తమ మొబైల్ ఫోన్ కి వచ్చే వీడియో కాల్స్ మీద పాఠశాలల, కాలేజీ అమ్మాయిలు జాగ్రత్త వహించాలని అన్నారు. క్రైమ్ ఎగైనెస్ట్ ఉమెన్ వంటి అంశాల మీద రాష్ట్ర ప్రభుత్వం సీరియస్ గా దృష్టి పెట్టిందని, ఈ కేసులను త్వరగా పూర్తి చేయుటకు ప్రత్యేక కోర్టులను సమీప భవిష్యత్తులో ఏర్పాటు అవుతాయన్నారు. జిల్లా కలెక్టర్ శ్రీ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ మాట్లాడుతూ సైబర్ క్రైమ్ ద్వారా యువతీ యువకుల ఎక్కువగా ప్రలోభాలకు గురి అవుతున్నారని, సైబర్ క్రైమ్ పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఈ సైబర్ క్రైమ్ బాధితులలో ఎనిమిదవ తరగతి నుంచి డిగ్రీ చదివే విద్యార్థులు ఎక్కువగా ఉన్నారని తెలిపారు. చిన్నతనంలోనే చదువు మానేసి బాల కార్మికులగా వివిధ రకాల పనులు చేస్తూ వారి బంగారు భవిష్యత్తుకు దూరం అవుతున్నారని తెలిపారు. సంబంధించి ఐదు సంవత్సరాల పిల్లలు ఎక్కువగా చైల్డ్ ట్రాఫికింగ్ గురవుతున్నారని తెలిపారు. మహిళ విశ్వవిద్యాలయం ఉపకులపతి శ్రీమతి వి. ఉమ గారు మాట్లాడుతూ సైబర్ నేరాలకు యువతీ యువకులే ఎక్కువగా గురి అవుతున్నారన్నారు. సైబర్ క్రైమ్ నేరాలను అరికట్టడంతో పాటు అలాంటి ప్రలోభాలకు గురికాకుండా ఎలా వాటి నుంచి బయటపడాలి అనే దానిపైన దృష్టి పెట్టడం వలన సైబర్ నేరాలను అరికట్టవచ్చు అని తెలిపారు. యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ అందించిన జీవన నైపుణ్యాలను విద్యార్థులకు అందరికీ అందుబాటులో ఉంచడం జరుగుతుందని, జీవన నైపుణ్యాల గురించి తెలుసుకోవడం వలన విద్యార్థులు తమ జీవితంలో వచ్చే సమస్యలను ఎదుర్కొనేలా వారికి ఒక అవగాహన ఉంటుందని తెలిపారు. కావున యువత ఇలాంటి ప్రలోభాలకు లోనవ్వకుండా వాటి నుంచి ఎలా బయట పడాలనే దిశగా ఆలోచించి అవగాహన కలిగి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు పరిపాలన, రవి మనోహరచారి, మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ శ్రీలత, మహిళా యూనివర్సిటీ రిజిస్టర్ రజిని, సైబర్ క్రైమ్ పోలీస్ సిబ్బంది, పలు విద్యాసంస్థల విద్యార్థులు పాల్గొన్నారు.

### వ్యవసాయ కార్యాలయమా

## నీ చిరునామా ఎక్కడ..?

### అగ్రికల్చర్ ఆఫీస్ కోసం రైతుల వెతుకులాట

రామచంద్రాపురం, నవంబర్ 11 ప్రభాతవార్త:

వ్యవసాయ కార్యాలయమా నీ చిరునామా ఎక్కడ అంటూ రైతులు వెతుకులాడుతున్నారు. ప్రభుత్వం రైతు సంక్షేమమే లక్ష్యంగా అనేక పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నది. ప్రభుత్వ కార్యక్రమాలను రైతులకు చేరువ చేయాల్సిన వ్యవసాయశాఖ అధికారులు కనీసం తమ కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకోవడంలో మీనమేషాలు లెక్కబెడుతుం డటంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో రామచంద్రాపురం పోలీస్ స్టేషన్ ప్రక్కన వ్యవసాయ కార్యాలయం ఏర్పాటు చేశారు. ఆ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో శ్రీశక్తి భవనం మొదటి అంతస్తులోనికి తరలించారు. గత కొంత కాలంగా శ్రీశక్తి భవనంలో వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని మూసివేయడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో వున్నారు. రైతు భరోసా కేంద్రాలు వున్నప్పటికీ అవి సచివాలయాలకు దూరంగా వుండటంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. కనీసం మండల వ్యవసాయ శాఖ అధికారి నుండి ఎరువులు, విత్తనాలు, తీసుకోవాలన్నా, సలహాలు, సూచనలు పొందాలన్నా వెతుకులాట తప్పడం లేదంటున్నారు. ఇకనైనా వ్యవసాయశాఖ కార్యాలయాన్ని మండల కేంద్రంలో ఏర్పాటు చేయడంపై జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

## జనసేనలో చేరిన వేణుగోపాల్‌రెడ్డి

పుంగనూరు,నవంబరు 11 ప్రభాతవార్త :

సాటిమనుషులకు సాయపడుతూ ఒకటిన్నర దశాబ్దంగా సేవలందిస్తున్న వేణుగోపాల్‌రెడ్డి అనే సామాజికవేత్త, నిర్మాణవేత్త సోమవారం జనసేన అధినేత, రాష్ట్ర డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ సారధ్యంలో జనసేన పార్టీలో చేరడం అత్యంత ఆసక్తికరమైన విషయమైంది. ఎందుకంటే, నియోజకవర్గంలోనే కాకుండా అటు కర్నాటక,ఇటు తమిళనాడు ప్రాంతాలకు కూడా దాతగా చిరకాలముగా గుర్తుండిపోయిన వేణుగోపాల్‌రెడ్డి,ఇంతకాలం పార్టీలు వద్దని,ప్రజలే తన పార్టీని మిన్నకుండి పోయారు. అయితే,పుంగనూరు నియోజకవర్గంపై ఎంతోకాలముగా కన్నేసిన జనసేన అధిష్టానం ఇక్కడ ప్రజల మద్యన మనిషిని,ఒక సాధారణ వ్యక్తిని వృద్ధిలోనికి తీసుకురావాలని తద్వారా పుంగనూరు రాజకీయాలపై పట్టు సాధించాలని భావించింది. వేణుగోపాల్‌రెడ్డిని తక్షణం చేర్చుకోవాలని అధిష్టానం భావించడంతో పాటూ పిలుపు రావడంతో హుటాహుటిన వేణుగోపాల్‌రెడ్డి సోమవారం మంగళగిరి చేరుకున్నారు. సోమవారం సాయంత్రం పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ ఆయనను ఆహ్వానించి,పార్టీ కండువాకప్పి సత్కరించారు. పుంగనూరులో అభివృద్ధికి ఇక శ్రీకారం చుడదామని వేణుగోపాల్‌రెడ్డి భుజం తట్టారు.

## సరిహద్దు చెక్‌పోస్టు వద్ద అక్రమ తెల్లక్వార్జ్ రాయి స్వాధీనం

తడ, నవంబర్ 11 ప్రభాతవార్త
తడ మండలం భీములవారిపాలెం తనిఖీ కేంద్రం వద్ద అక్రమంగా తరలిపోతున్న తెల్ల క్వార్జ్ రాయి టిప్పర్‌ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు సూళ్లూరుపేట సిఐ ఎం.మురళీకృష్ణ, తడ ఎస్ఐ ఎ.కొండప్పనాయుడు తడలో మీడియా సమావేశంలో వివరించారు. గూడూరు నుంచి చెన్నైకి తరలిస్తున్న టిప్పర్ డ్రైవర్‌తో పాటు యజమానులను కూడా అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. గూడూరు మండలం తిరువెంగలాయపురం గ్రామానికి చెందిన యనమల వెంకటేశ్వర్లు, గూడూరుకు చెందిన మన్నవరపు రమేష్, మేకా శివకుమార్ తెలంగాణలోని నాగర్‌కర్నూలు జిల్లా యల్దండ మండలం మల్లికార్జున మినరల్స్ యజమానిలను నిందితులుగా తెలిపారు.నాయుడుపేట డిఎస్పీ చెంచుబాబు పర్యవేక్షణలో పోలీసులు భీములవారిపాలెం వద్ద సోమవారం జాతీయ రహదారిపై తనిఖీలు చేస్తుండగా, ఈ తెల్ల క్వార్జ్ రాయి పట్టుబడింది. ఇసుక, క్వార్జ్ వంటివి అక్రమరవాణా కాకుండా తనిఖీలు చేస్తున్నామని, తెలంగాణకు చెందిన మల్లికార్జున మినరల్స్ లీజర్ పేరుతో ప్రస్తారా, గూడూరు ఎగుమతులు, దిగుమతులు అనే వారి ద్వారా తరలిస్తున్నట్లు గుర్తించి తడ పోలీసుస్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

## ఇంటి వద్దే కాన్సర్ నిర్ధారణ పరీక్షలు

చిత్తూరు, నవంబర్ 11 ప్రభాతవార్త:
జిల్లాలో ఈ నెల 14వ తేదీ నుండి ఇంటి వద్దే కాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి చికిత్స చేపట్టాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుండి సోమవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ వైద్యశాఖ అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీ నుండి ప్రతి ఇంటి నందు 18 సంవత్సరాలు పూర్తయిన ప్రతి ఒక్కరికి అసంక్రమణ వ్యాధుల్లో బిపీ, షుగర్, గుండెజబ్బులు, థైరాయిడ్, పక్షవాతం, బ్రెస్ట్ కాన్సర్ తదితర వాటికి వ్యాది నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నిర్ధారణ పరీక్షల్లో వ్యాధి నిర్ధారణ అయితే సులభంగా చికిత్స చేయవచ2చునని, ఈ కార్యక్రమంలో పాల్గొనే ప్రతి ఒక్కరు మానవతా ధృక్పథంతో క్వాలిటీగా స్క్రీనింగ్ కార్యక్రమం చేపట్టాలన్నారు. ఈ నెల 8, 9 తేదీల్లో జిల్లాలోని పిహెచ్‌సిల్లోని సిబ్బందికి క్యాన్సర్ స్క్రీనింగ్‌పై పూర్తి శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. డిఎంహెచ్ఓ డాక్టర్ ప్రభావతి దేవి మాట్లాడుతూ ఎవరికైనా గుండెనొప్పి వుంటే వారిని 108 ద్వారా ఏరియా ఆసుపత్రికి రెఫర్ చేసినట్లైతే ఇసిజి ద్వారా నిర్ధారించిన అనంతరం వారికి రూ.45 వేలు విలువైన ఇంజెక్షన్లు వేసి వారి ఆరోగ్యంను సంరక్షించి సంబంధిత ఆసుపత్రికి తరలించడం జరుగుతుందన్నారు. ఈ జూమ్ కాన్ఫరెన్స్‌లో ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, డిఎంహెచ్ఓ డాక్టర్ ప్రభావతిదేవి, అడిషనల్ డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకటప్రసాద్, డిఐఓ డాక్టర్ హనుమంతరావు, ఎన్‌సిడి ఆర్‌బిఎస్‌కె ప్రొగ్రాం అధికారి డాక్టర్ శిరీష, డాక్టర్ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు మహిళలను మరోసారి మోసం చేశారు - రోజా

నగరి, నవంబరు 11 ప్రభాతవార్త:
చంద్రబాబు మహిళలను మరోసారి మోసం చేశారని మాజీ మంత్రి రోజా అన్నారు. తొలి బడ్జెట్ కేటాయింపుపై సోమవారం ఎక్స్ వేదికగా ఆమె స్పందించారు. 19 నుంచి 59 ఏళ్ళ మహిళలకు నెలకు రూ.1500 చొప్పున ఏడాదికి 18,000 ఇస్తామని వాగ్దానం చేసి బడ్జెట్‌లో నిధులు ఇవ్వకపోవడం మోసం కాదా అని ప్రశ్నించారు. ఎన్నికల్లో గెలవగానే ప్రతి నిరుద్యోగ యువతి, యువకులకు నెలకి రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం దగా కాదా అన్నారు. ఎన్నికల్లో గెలవగానే మహిళలకి ఉచిత బస్సు పథకం అమలు చేస్తామని ఆ పథకం ఊసే ఎత్తకపోవడం, నిధులు కేటాయించకపోవడం మోసం కాదా అన్నారు. తల్లికి వందనం పథకానికి నిధులు సగానికిపైగా కోత పెట్టడం అన్యాయం కాదా అన్నారు. ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని, ఈ ఏడాది 2 సిలిండర్లను ఎగనామంపెట్టడం మోసం కాదా అని, ఎన్నికల్లో ఓట్లు వేయించుకున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఇంటింటికి ఇచ్చిన బాబు ష్యూరిటీ భవిష్యత్‌కి గ్యారెంటీ బాండ్లను ఇప్పుడు ఏంచేసుకోవాలన్నారు.

## పిజిఆర్ఎస్‌కు 131 సమస్యలు

చిత్తూరు, నవంబర్ 11 ప్రభాతవార్త: ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఈ వారం జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజలు సమస్యలపై 131 అర్జీలను అధికారులకు అందజేశారు. ప్రజల నుండి సమస్యలపై అందిన అర్జీలను సత్వరం పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

## విద్యుత్‌ఛార్జీల భారం వద్దు

### -తిరుపతిలో కాంగ్రెస్ నేతల నిరసన



తిరుపతి,నవంబర్ 11ప్రభాతవార్త:
రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమి పార్టీల ప్రభుత్వం ఏర్పాటై నాలుగునెలలు కావస్తోందని, ఇది ప్రజల ప్రభుత్వం అని చెబుతున్న ప్రజాప్రతినిధులు విద్యుత్ ఛార్జీల భారం మోపవద్దని కాంగ్రెస్ పార్టీ నేతలు డిమాండ్ చేశారు. పెంచిన కరెంట్ ఛార్జీలను వెంటనే రద్దుచేయాలని కాంగ్రెస్‌పార్టీ నేతలు నిరసన తెలిపారు. 2024లో ఎన్నికలకు ముందు చంద్రబాబునాయుడు ఓట్లకోసం ఆచరణ కాని హామీలను ప్రజలకు ఇచ్చి మోసం చేస్తున్నారన్నారు. అధికారంలోకి వచ్చి నాలుగునెలల గడవకముందే విద్యుత్ ఛార్జీలను భారీగా పెంచారన్నారు. దాదాపు 6వేలకోట్ల విద్యుత్ సర్దుబాటు చార్జీలను మోపడం దారుణమన్నారు.రాష్ట్రప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ తిరుపతిలో ఎస్‌పిడిసిఎల్ ప్రధాన కార్యాలయం ఎదుట కాంగ్రెస్‌పార్టీ జిల్లా నాయకులు నిరసన తెలిపారు. తిరుపతి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బాల గురవంబాబు, తిరుపతి నగర పార్టీ అధ్యక్షుడు గౌడపేర చిట్టిబాబు, పిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమటం వెంకట నరసింహులు, ఏఐసిసి బిసిసెల్ కో ఆర్డినేటర్ మురళీకృష్ణ, పిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి సుప్రజ, తిరుపతి జిల్లా ఎస్పీ విభాగం అధ్యక్షుడు చిత్తూరు శివశంకర్, డిసిసి ప్రధాన కార్యదర్శి లోకేశ్‌రెడ్డి,శ్రీకాళహస్తి నియోజకవర్గం కోఆర్డినేటర్ దామోదర్‌రెడ్డి,మల్లికార్జున, నాని, శివబాలాజీ, స్వరూప్‌నాయక్,చిరంజీవి పాల్గొన్నారు.

## ఉసిరి చెట్ల కింద కార్తీకమాస వనభోజనం

తిరుపతి,నవంబర్ 11ప్రభాతవార్త:
పవిత్రమైన కార్తీకమాసంలో...ఉసిరిచెట్ల క్రింద వనభోజనాలను రాయలసీమ రంగస్థలి, భజనమండలి ఘనంగా ఏర్పాటు చేశాయి. సి.రామాపురంలోని ఓ వనంలో ఉసిరిచెట్ల క్రింద పూర్తి శాఖాహారంతో సాగింది. ప్రతి శనివారం నగరంలో ఆధ్యాత్మిక శోభతో భజనలు, గోవిందనామస్మరణలు చేస్తున్న విషయం విదితమే. సోమవారం భజనమండళ్ళ సభ్యులు గుండాల గోపీనాథరెడ్డి, వాసుదేవరెడ్డి , పులిగోరు ప్రభాకర్‌రెడ్డి, కోండే చంగారెడ్డి, జయమ్మ, ధనమ్మ, చంద్రకళ, విగ్రహాల కల్యాణి, జ్యోతి, యశస్విని, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, మురళి, వాసు, తిరుపాల,నాగేశ్వరరావు, కళావతి, బాగ్యలక్ష్మి, మల్లారపురవిప్రసాద్, రాజశేఖరరెడ్డి తదితరులు కలసి కార్తీకవనభోజనం చేపట్టారు. శివకేశవులకు ఎంతో ప్రీతిపాత్రమైన ఈ మాసంలో ఉసిరిచెట్టు, జిమ్మిచెట్లు వనభోజనాలు శ్రేయస్కరమన్నారు.

## యువతరంగ్ యూత్ ఫెస్టివల్‌లో కెడిసి విద్యార్థుల ప్రతిభ

కుప్పం, నవంబర్ 11 ప్రభాతవార్త

తిరుపతి ఎస్వీయులో జరిగిన యువతరంగ్ - 2024 ఇంటర్ కాలేజియేట్ యూత్ ఫెస్టివల్‌లో కుప్పం డిగ్రీ కాలేజ్ విద్యార్థులు 24మంది హాజరై ప్రతిభ చాటారు. జానపద నృత్యాలు, ఫోటోగ్రఫీ, మిమిక్రీ, మెహందీ, పోస్టర్ మేకింగ్, క్విజ్ వంటి పోటీల్లో పాల్గొని అభినందనలు పొందారు. బికాం సెకండియర్ విద్యార్థి చరణ్ మిమిక్రీ, బిసిఎ విద్యార్థి ఆదిచరణ్ ఫోటోగ్రఫీలో తృతీయ బహుమతులు సాధించారు. ఈసందర్భంగా విద్యార్థులను కాలేజ్ వైస్ ఛైర్మన్ సాగర్ రాజ్ అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి. సుధారాణి, మహిళా కోఆర్డినేటర్ ఉష, పిడి సుధాకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## తెదేపాలో కార్యకర్తల సంక్షేమానికి పెద్దపీట

– ఎపిఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం

కుప్పం, నవంబర్ 11 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్‌లు తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని ఎపిఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. సోమవారం మున్సిపల్ పరిధి పదో వార్డులో తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమంను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వంద రూపాయలు చెల్లించి సభ్యత్వం పొందే కార్యకర్తలకు ఐదు లక్షల రూపాయల భీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. అలాగే కార్యకర్తలు మృతి చెందితే అంత్యక్రియలకు మరో పదివేల రూపాయలు చెల్లించడం జరుగుతుందన్నారు. సభ్యత్వ నమోదులో కుప్పాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు నేతలు, కార్యకర్తలు చొరవ చూపాలన్నారు. రాష్ట్ర నేతలు గోపీనాథ్, డా॥ వెంకటేష్, మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, మాజీ సర్పంచ్ డికెపల్లి మణి, కౌన్సిలర్‌వేలు, డికెపల్లిపార్టీ అధ్యక్షుడు డివి భాస్కర్, మైనార్టీ నేతలు నబీఉల్లా, బాబు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం

కుప్పం, నవంబర్ 11 ప్రభాతవార్త

మున్సిపల్ పరిధి సామగుట్టపల్లి యుపి స్కూల్‌లో జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా దేశ తొలి విద్యాశాఖ మంత్రి దివంగత మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూజలు నిర్వహించారు. ఉపాధ్యాయులు గాలి సురేష్ మాట్లాడుతూ విద్యతోనే సామాజిక అసమానతలు తొలగుతాయన్నారు. దేశంలో అనేక విద్యాసంస్థల ఏర్పాటుకు కలాం కృషి చేశారని విద్యారంగంలో ఆయన గొప్ప దార్శనికుడు అని కొనియాడారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంచారు. ఉపాధ్యాయులు సౌజన్య, శాంత, గాయత్రి, విజయనిర్మల, సరస్వతి, విద్యార్థులు పాల్గొన్నారు.

## దేవతలకు ఆదర్శం భగవద్గీత .. విద్యార్థులకు పోటీలు

కుప్పం, నవంబర్ 11 ప్రభాతవార్త

దేవతలకు సైతం భగవద్గీత ఆదర్శంగా నిలిచిందని కుప్పం శ్రీ సుజ్ఞానంద ఆశ్రమం స్వామి ఆంజనేయులు పేర్కొన్నారు. సోమవారం స్థానిక టిబి రోడ్‌లోని ఆశ్రమంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భగవద్గీత తత్వం గురించి ప్రచారం చేయాలని తాను ఉద్యోగానికి రాజీనామా చేసి సన్యాస దీక్ష చేపట్టినట్లు పేర్కొన్నారు. ఏర్పేడు వ్యాసాశ్రమంలో స్వామి విద్యానందస్వామికి తాను శిష్యుడని చెప్పారు. భగవద్గీత సమాజం శాంతియుతంగా ఉండాలని సూచిస్తుందన్నారు. భగవంతుడి అనుగ్రహం ఎలా పొందాలో తెలియజేస్తుందన్నారు. ఈ నేపథ్యంలో భగవద్గీత పుట్టిన రోజు అయిన మార్గశిర మాసం ఏకాదశి నాడు డిసెంబర్ 11వతేది కుప్పంలో భగవద్గీత కంఠస్త పోటీలను పిల్లలు, పెద్దలకు నిర్వహించడం జరుగుతుందన్నారు. వీరికి నగదు బహుమతులు సైతం అందిస్తామన్నారు. శ్రీకృష్ణపరమాత్ముడిని రాధాకృష్ణుడిగా కాక గీతాకృష్ణుడిగా చూడాలని భగవద్గీత ధర్మ గ్రంథం అని పేర్కొన్నారు. సమావేశంలో ఆర్. శ్రీనివాసులు, వెంకటాచలపతి గుప్తా, శివభూషణమ్మ, రాజేంద్రకుమార్, భక్తవత్సలం, మనోహర్, మురుగేష్, నందకుమార్ పాల్గొన్నారు.

## వంద లీటర్ల నాటుసారా ధ్వంసం

రామకుప్పం, నవంబర్ 11 ప్రభాతవార్త

మండలంలోని టేకుమాను తాండా అటవీ ప్రాంతంలో నాటుసారా స్థావరాలపై ఎస్సై వెంకటమోహన్ సిబ్బందితో కలసి దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా వంద లీటర్ల సారాను ధ్వంసం చేశారు. సారా తయారీ సామగ్రి పగలగొట్టారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మండలంలో అక్రమ కార్యకలాపాలకు ఎవరైనా పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

## రక్తదానం చేసిన సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థినులు

చిత్తూరురూరల్, నవంబరు 11 ప్రభాతవార్త:

చిత్తూరుపట్టణం, ఎన్‌పి సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా కళాశాలకు చెందిన 25మంది విద్యార్థినులు స్వచ్ఛందంగా రక్తదానం చేసినట్లు కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసరు షమ్స్ అక్తర్ తెలిపారు. సోమవారం కళాశాల నందు ఎన్ఎస్ఎస్ యూనిట్, ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరంను ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ డా.మనోహర్ మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రతి ఒక్కరు ఆరు నెలల కొకసారి రక్తదానం చేయడం వల్ల ఆరోగ్యంగా వుంటారని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థినులు రక్తదానం చేసిన 25 యూనిట్ల రక్తాన్ని రెడ్‌క్రాస్ ప్రతినిధులకు అందజేసారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ నరేంద్ర, కళాశాల యూత్ రెడ్‌క్రాస్ కోఆర్డినేటర్ వైష్ణవి, రెడ్‌రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ కోమల, కళాశాల అధ్యాపక బృందం, రెడ్‌క్రాస్ సంస్థ అధ్యక్షులు సహదేవనాయుడు, డాక్టర్ విజయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మామిడి పూత దశలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి

యర్రావారి పాలెం, నవంబర్ 11, ప్రభాతవార్త

మండలంలోని మామిడి రైతులు మామిడి పూత దశలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎర్ర వారి పాలెం ఆర్టికల్చర్ హెచ్ఓ శివకుమారి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం అక్కడక్కడ మామిడి తోటల్లో పూత వస్తుందన్నారు. పూత వచ్చిన తోటల్లో తేనె మంచు పురుగులు, పూత గూడు పురుగులు, పక్షి కన్ను తెగులు ఉధృతి పెరుగుతుంది. నివారణకు అసిఫేట్ 0.5 గ్రాములు, టెఫ్లూబెంజురాన్ 0.5 మిల్లీ, కార్బండాజిమ్ 1 గ్రాము లీటర్ నీటికి జిగురు కలిపి పిచికారి చేయాలి. అలాగే పూత రాని తోటల్లో పూత రావడానికి 13045 (మల్టీకే) 10 గ్రాములు, బోరాన్ 1 గ్రాములు, యూరియా 5 గ్రాములు లీటర్ నీటి కలిపి పిచికారి చేయాలని అన్నారు. మందులు పిచికారి చేసేటప్పుడు చెట్టు మొత్తం తడిచే విధంగా పిచికారి చేయాలని కోరారు. పూత బాగా వచ్చిన తరువాత ఎలాంటి మందులు వాడరాదని అన్నారు.

## 15న గణనాధునికి ఘనంగా అన్నాభిషేకం

కాణిపాకం, నవంబర్ 11 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో ఈనెల 15న స్వామివారికి అన్నాభిషేకంను అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్ తెలిపారు. ప్రతి ఏటా ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా స్వామివారికి అన్నాభిషేకం నిర్వహించడం ఆనవాయితీ. ఈమేరకు ఈనెల 15న అన్నాభిషేకం నిర్వహిచనున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా ప్రధాన ఆలయంలో వేకువజామున 4 నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు జరిగే సుప్రభాతం, మొదటి కాల అభిషేకం, సహస్ర నామార్చన, పాలాభిషేకం ఆర్జిత సేవలను రద్దు చేసినట్లు తెలిపారు. గోపూజ, ఉదయం మహాహారతి, సాయంత్రం సత్య ప్రమాణాలు, పాలాభిషేకం, మహాహారతులు ఆర్జిత సేవలు యధావిధిగా జరుగుతాయని ఈఓ తెలిపారు. ఈఅన్నాభిషేకం కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

## గురువుకు సాయం అందించిన శిష్యులు

వెదురుకుప్పం, నవంబర్ 11 ప్రభాతవార్త :

విద్య బుద్ధులు నేర్పి తమ అభివృద్ధికి తోడ్పాటు నందించి... అనారోగ్యంతో బాధపడుతున్న గురువుకు శిష్యులు ఆర్థిక సాయం సోమవారం అందజేశారు. మండలం కేంద్రంలోని ప్రవేటు పాఠశాల మహర్షి విద్యామందిర్‌లో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించిన పి.దేశముని ఇటీవల అనారోగ్యంకు గురికావడంతో సమాచారం తెలిసిన పూర్వ విద్యార్థులు స్పందించి ఆయన నివాసంకు చేరుకుని పరామర్శించి, 50 వేల రూపాయాలు ఆర్థిక సాయం అందజేశారు. సందర్భంగా గురువుతో మాట్లాడుతూ మెరుగైన వైద్యం చేయించుకుని ఆరోగ్యం కాపాడుకావలని తెలిపారు. వెదురుకుప్పం ఎంపీటీసీ సభ్యులు పుత్తూరు రాధిక పురంధర్ రెడ్డి, గపూర్, హేమాద్రి, దాము తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాల నిర్మాణంకు నిధులు మంజూరు

వెదురుకుప్పం, నవంబర్ 11 ప్రభాతవార్త :

వెదురుకుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాల సొంత భవనాల నిర్మాణ పనులకు 17, 82,50,000 రూపాయాలు నిధులు మంజూరుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గ్రీన్ సిగ్నల్స్ ఇచ్చినట్లు సమాచారం. మండలంలోని కొమరగుంట సమీపంలో గత వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం డిగ్రీ కళాశాలకు స్థలం కేటాయించి నిధులు మంజూరు చేసిన్నప్పటికి నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. దీంతో గంగాధర నెల్లూరు నియోజకవర్గం శాసనసభ సభ్యులు డాక్టర్ థామస్ చొరవతో డిగ్రీ కళాశాల నిర్మాణ పనుల కొరకు నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్ళడంతో స్పందించిన సీఎం నిర్మాణ పనులు చేపట్టడం కొరకు 17 కోట్ల 85 లక్షల యాభైవేల రూపాయాలు మంజూరు చేసిన్నట్లు తెలిపారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## రాష్ట్ర పునర్నిర్మాణం చంద్రన్నతోనే సాధ్యం : గువ్వల

చౌడేపల్లి, నవంబర్ 11 ప్రభాతవార్త

రాష్ట్ర పునర్నిర్మాణం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమవుతుందని మండల తేదేపా అధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని గడ్డంవారిపల్లి పంచాయతీ బత్తలాపురంలో రూ. 10లక్షలతో మంజూరైన డ్రైనేజీ పనులకు ఆయన భూమి పూజ చేసారు. రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో వున్నప్పటికీ సంక్షేమం, అభివృద్ధిని ఎన్డీయే కూటమి తేదేపా ప్రభుత్వం పరుగులు తీయిస్తోందన్నారు. రాబోయే రోజుల్లో అందరికీ మేలు జరుగుతుందన్నారు. సీనియర్ నాయకుడు పూల చంద్రమౌళి, బోయకొండ సుబ్బు, గిరినాయుడు, సోషియల్ మీడియా కళ్యాణ్, కుమార్‌రెడ్డి, తేదేపా నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఇజిఎస్ ఎపిఓగా చిన్నరెడ్డెమ్మ

చౌడేపల్లి, నవంబర్ 11 ప్రభాతవార్త

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం మండల ఎపిఓగా చిన్నరెడ్డెమ్మ నియమితుల య్యారు. ఈమేరకు సోమవారం ఆమె స్థానిక ఐకెపి భవనంలో బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న శ్రీనివాసులు యాదవ్ గంగవరంకు బదిలీ కాగా పెద్దపంజాని నుంచి చిన్నరెడ్డెమ్మ ఇక్కడికి నియమితులయ్యారు.

## రెవెన్యూ కార్యాలయం వద్ద రైతుల ధర్నా

సోమల, నవంబర్ 11, ప్రభాతవార్త

సోమల తహసిల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ఉదయం రైతులు ధర్నాకు దిగారు. ఆవులపల్లి ప్రాజెక్టుకు సంబంధించిన భూములు నిషేధిత జాబితాలో గత ప్రభుత్వం చేర్చిందని అన్నారు. వాటిని తీసి వేసి వన్ బి వచ్చేలా చర్యలు తీసుకుంటామని తాసిల్దార్ హామీ ఇచ్చి నెల రోజులు గడుసున్న స్పందన లేకపోవడంతో రైతులు ఆగ్రహించి ధర్నాకు దిగారు. సుమారు 30 మంది రైతులు కార్యాలయం ఎదుట ధర్నాకు దిగి ఆందోళన చేపట్టారు. ఆఫీసుకు తాళం వేసి కార్యాలయం పనులు స్తంభింప చేస్తామని హెచ్చరించారు. డిప్యూటీ తాసిల్దార్ నాగరాజ ఆందోళన కారులతో మాట్లాడుతూ తహసిల్దార్ సెలవుపై వెళ్లారని బుధవారం సమస్య ఆయన దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

## చంద్రబాబు నాయకత్వంలోనే మైనారిటీల అభివృద్ధి

– విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేసిన జిజెయం ఛారిటబుల్

చిత్తూరురూరల్, నవంబరు 11 ప్రభాతవార్త:

రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు నాయకత్వంలోనే ముస్లీం, మైనార్టీల అభివృద్ధి సాధ్యమవు తుందని జిజెయం ఛారిటుబల్ ఫౌండేషన్ డైరెక్టర్ గురజాల చెన్నకేశవులనాయుడు పేర్కొన్నారు. సోమవారం నాగయ్య కళాక్షేత్రంలో మౌలాని అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని మైనారిటీల సంక్షేమ దినోత్సవంను నిర్వహించారు. చంద్రబాబు హయాంలో ముస్లీం, మైనారిటీల ప్రజల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడం జరిగిందనీ, రాష్ట్రప్రభుత్వం మైనారిటీల సంక్షేమశాఖల అద్వర్యంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని మైనారిటీలు ఉన్నత స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. అనంతరం చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌గారి జిజెయం ఛారిటుబల్ ట్రస్టు ఆద్వర్యంలో సుమారు 1400మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేసారు. అలాగే మాజీ ఎమ్మెల్సీ దొరబాబు మాట్లాడుతూరాష్ట్రంలో ప్రతి నియోజకవర్గం, మండలాల్లో షాదిఖానాలను నిర్మించిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. మాజీ మేయర్ కఠారి హేమలత మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో మంచి ప్రభుత్వం నడుస్తోందన్నారు. జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి చిన్నారెడ్డి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మైనారిటీ సంక్షేమశాఖలు, వక్ఫ్‌బోర్డు, ఉర్దూఅకాడమీల ద్వారా అందుతున్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి సురేంద్రకుమార్, దేశం నాయకులు గురజాల జీవన్, ముస్లీం మైనార్టీ పెద్దలు షంషీర్, మౌలానా అన్వర్ హజరత్, మౌలానా అన్వర్ హజరత్, చిత్తూరు తెలుగుదేశం పార్టీ మైనార్టీ నాయకులు జాఫర్, మున్న, జిలానీ, రియాజ్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## వర్షం పడిందా.. తిప్పలు తప్పవు

పాకాల, నవంబర్ 11, ప్రభాతవార్త

పాకాల మండలం దామలచెరువు మొగరాల రోడ్డులో రైల్వే స్టేషన్ కింద ఉన్న అండర్ బ్రిడ్జ్ నందు చిన్న పాటి వర్షం పడినప్పుడల్లా నీరు నిలిచి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ట్రైన్ కాలవను క్లీన్ చేసి బ్రిడ్జి కింద నీరు నిలువకుండా చూడాలని ప్రజలు వాహనదారులు కోరుతున్నారు.

## సైబర్ నేరాల మీద అవగాహన కార్యక్రమం

పాకాల, నవంబర్ 11, ప్రభాతవార్త

పాకాల మండలం లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థిని విద్యార్థులకు సైబర్ నేరాల మీద అవగాహన కార్యక్రమం జిల్లా కలెక్టర్ ఆదేశాలతో పాకాల సి.ఐ మద్దయ్యాచారి ఆధ్వర్యంలో ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరి, బేబీశ్వర్ రెడ్డిల అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. సి.ఐ మాట్లాడుతూ జూనియర్ కళాశాల విద్యార్థినీ, విద్యార్థులకు డిజిటల్ టీవీ ద్వారా సైబర్ నేరాల మీద అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఏ.ఎస్.ఐ వెంకట్రామానాయుడు, రవి, పోలీస్ సిబ్బంది, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బ్రాందీ బ్రాండ్ పాతదే స్టిక్కర్ మాత్రమే కొత్తది

రూరల్ వైసిపి నాయకులు విమర్శ

తిరుపతి హెల్త్, నవంబర్ 11, ప్రభాతవార్త

కూటమి ప్రభుత్వ పాలనలో బెల్ట్ షాపులు విపరీ తంగా పెరిగిపోయాయనితిరుపతి రూరల్ వైసీపీ నాయకులు దామినేటి కేశవులు తదితరులు ఆరోపిం చారు. తిరుపతి ప్రెస్ క్లబ్లో సోమవారం మీడియా ముందు వీరు మాట్లాడుతూ పేద ప్రజలు మద్యం కోసం దూరంగా ఉన్న బ్రాందీ షాపులకు పోయి రావడానికి ఇబ్బంది పడుతూ మెడిసన్‌లా మద్యం తీసుకుంటారని తెలియజేశారు. కానీ బెల్ట్ షాపులు నివాస ప్రాంతాలలో ఉండటం వలన స్తుతిమించి మద్యానికి బానిసలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ బెల్ట్ షాపులకు సంబంధించి పూర్తి ప్రూఫ్ తో తాము నిరూపించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.

## 14న పారా మెడికల్ కోర్సుల స్టెరాయి వేకెన్సీ ఆఫ్ లైస్ విధానం ద్వారా కౌన్సిలింగ్

తిరుపతి హెల్త్, నవంబర్ 11, ప్రభాతవార్త

స్విమ్స్ యూనివర్శిటీలో ఈ నెల 14వ తేది గురువారం స్విమ్స్ కమిటీహాల్‌లో బిఎస్సి నర్సింగ్‌లో పలు కోర్సులకు మిగిలిన 8 ఖాళీలకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు స్విమ్స్ రిజిస్ట్రార్ తెలిపారు. ఇంతకు ముందు దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రమే ఖాళీల రిజర్వేషన్ క్యాటగిరి ప్రకారం ఏపి ఈఎపి సెట్ ర్యాంక్‌ను అనుసరించి కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికేట్, పూర్తి ఫీజుతో హాజరు కాగలరన్నారు. మరిన్ని వివరాల కొరకు స్విమ్స్ వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

## ప్రతిరోజూ ఇంటింటి చెత్త సేకరణ పక్కాగా చేపట్టాలి

అధికారులను ఆదేశించిన కమిషనర్ ఎన్. మౌర్య

**తిరుపతి కార్పొరేషన్, నవంబర్ 11, ప్రభాతవార్త** నగరపాలక సంస్థ పరిధిలో ఇంటింటి చెత్త సేకరణ పక్కాగా చేపట్టాలని కమిషనర్ ఎన్.మౌర్య ఆరోగ్య శాఖ విభాగం అధికారులను ఆదేశించారు. సోమవారం గత వారం పిజిఆర్ఎస్ లో వచ్చిన వినతుల పరిష్కారం, నగరంలో పారిశుద్ధ్య నిర్వహణ, పన్నుల వసూళ్లు తదితర అంశాలపై నగరపాలక సంస్థ కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులతో కమిషనర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ అన్ని వీధుల్లోకి వాహనాలు నిర్దిష్ట సమయంలో వెళ్లేలా, వాహనంతో పాటు శానిటరీ సెక్రటరీ వెళ్లేలా చర్యలు చేపట్టాలని అన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్స్ సేతుమాధవ్, రవి, సెక్రటరీ రాధిక, డిసిపి మాహాపతి, వెటర్నరీ ఆఫీసర్ నాగేంద్ర, ఉద్యానవన శాఖఅధికారి హరికృష్ణ, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు, మేనేజర్ హాసీమ్, డి.ఈ.లు, సూపరింటెండెంట్లు, ఏసిపి లు, శానిటరీ సూపర్ వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

## 304 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు

పాలసముద్రం, నవంబర్ 11 ప్రభాతవార్త: పాలసముద్రం మండలం బలిజకండ్రిగ ఎస్ఆర్ కండ్రిగ జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం 304 మంది విద్యార్థులకు ఆరోగ్యశాఖ సిబ్బంది ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఆప్తాల్మిక్ అసిస్టెంట్ మంజువాణి మాట్లాడుతూ కంటి పరీక్షలు నిర్వర్తించిన విద్యార్థుల్లో 9 మందికి కంటి అద్దాలు అవసరం అని, వీరికి త్వరలో కంటి అద్దాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ రఘు, ఉపాధ్యాయులు, పిహెచ్‌సి ఇన్‌ఛార్జీ మురళీ, ఆరోగ్య మిత్ర తదితరులు పాల్గొన్నారు.

## డాన్స్ పోటీలో విజయం సాధించిన గేట్ కళాశాల విద్యార్థులు

తిరుపతి విద్య, నవంబర్ 11, ప్రభాతవార్త

ఎస్వీ యూనివర్సిటీలోని ఇంటర్ కాలేజి గేట్ యూత ఫెస్టివల్ సందర్భంగా జరిగిన ఫోక్, ట్రైబల్ డాన్స్ పోటీలో గేట్ కళాశాల విద్యార్థులు మూడవ బహుమతి సాధించిందని కళాశాల ఛైర్మెన్ డాక్టర్ తమ్మినేని వెంకటేశ్వర్లు తెలిపారు. విద్యార్థులకు కళాశాల ఛైర్మన్, ప్రిన్సిపాల్ రమేష్, అధ్యాపకులు అభినందనలు తెలియజేశారు. కళాశాల ఛైర్మెన్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు ఎక్స్ట్రా కరికులర్ యాక్టివిటీస్ లో కూడా రాణించే విధంగా గేట్ కళాశాల వాళ్ళని ప్రోత్సహించేందుకు ఎప్పుడు మొదటి స్థానంలో ఉంటుందని తెలియజేశారు.

## మహిళా వర్సిటీలో ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం

తిరుపతి విద్య, నవంబర్ 11, ప్రభాతవార్త:

శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం విద్యా విభాగం నందు జాతీయ విద్యా దినోత్సవ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యా విభాగపు అధిపతి ప్రో.టి.జి.రాతవల్లి మాట్లాడుతూ మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ భారతీయ పండితుడు, రాజకీయ నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, భారతరత్న పురస్కారాన్ని 1992లో అందుకున్నారని తెలియజేశారు. భారత దేశంలో అనేక విద్యా సంస్థలకు ఆయన పేరు పెట్టుకున్నారని మౌలానా అబుల్ కలామ్ అకాడమిని 2006 లో హైదరాబాద్ లో స్థాపించారని, ఈ సంస్థయొక్క ధ్యేయం విద్యా సంస్కృతీ, సామాజిక సేవలలో కృషి చేయడమని చెప్పారు. ఆయన ముఖ్యంగా భారతీయ విద్యా వ్యవస్థ అభివృద్ధికి కృషి చేసిన గొప్ప వ్యక్తిగా పార్టీ ఒక్కరు గుర్తు ఎంచుకో దగ్గ వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో విద్యా విభాగ ఆచార్యులు ప్రో.జి.సునీత, డా.మాధవి, డా.అనురాధ, డా.బేబి ప్రసూనా, విద్యార్థులు పాల్గొన్నారు.

## నాటు తుపాకీ స్వాధీనం-ఇద్దరు అరెస్టు

నారాయణవనం, నవంబర్ 11 ప్రభాతవార్త :

మండలంలోని చిత్తూరుకండ్రిగ వద్ద ఆదివారం మధ్యాహ్నం 3గంటల ప్రాంతంలో నాటు తుపాకీ కలిగిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. పుత్తూరు డిఎస్పీ రవికుమార్, పుత్తూరు రూరల్ సిఐ జి రవీంద్రలు ఇచ్చిన సమాచారం మేరకు చిత్తూరుకండ్రిగ వద్దకు వెళ్లగా తమను చూసి ఇద్దరు వ్యక్తులు పారి పోవడానికి ప్రయత్నం చేశారు. తమ సిబ్బందితో పట్టుకొని వారిని విచారించగా వారి నుంచి నాటు తుపాకీ (ఎస్‌బిఎంఎల్ గన్)ను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఈ గన్‌తో వారు ప్రతిరోజు పక్కనే వున్న అటవీ ప్రాంతానికి వెళ్లి కందేళ్లు, పిల్లులను వేటాడి నారాయణవనంలో రహస్యంగా అమ్మి జీవనం సాగిస్తున్నట్టు ఒప్పుకున్నారు. పట్టుబడ్డ వారిలో తుంబూరు ఎస్టీ కాలనీకి చెందిన ఎల్లయ్య(35), వెలుతురుకండ్రిగ ఎస్టీకాలనీకి చెందిన ధర్మరాజుల లక్ష్మన్(38)లను పట్టుకోని కేసు నమోదు చేసు రిమాండ్‌కు తరలించినట్టు చెప్పారు.

## భూ సమస్యను పరిష్కరించిన ఆర్డీవో

కేవీబీ పురం, నవంబరు 11 ప్రభాతవార్త:

మండలంలోని కళత్తూరు గ్రామంలో గత కొన్ని రోజులుగా నెలకొని ఉన్న భూ సమస్యను శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి పరిష్కరించారు. వివరాలు ఇలా... మండలంలోని వేముల పూడి అటవీ ప్రాంతంలో కళత్తూరు దళితవాడకు చెందిన కొంతమంది పేదలు భూములు సాగు చేసుకుంటున్నారు. ఈ భూములు అటవీశాఖకు చెందినదని ఈ భూముల్లోకి ఎవరు ప్రవేశించరాదని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. నేపథ్యంలో కొంత మంది రైతులు ఉద్దులు చల్లడానికి ఉపక్రమించారు. విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో రైతులు గ్రామంలోని సెల్

## బైకులు చోరీ చేసే దొంగ అరెస్టు

### రూ. 2,50,000 రూపాయిలు విలువ చేసే 4 బైకులు స్వాధీనం

తిరుపతి కార్పొరేషన్, నవంబర్ 11, ప్రభాతవార్త

బైకులు చోరీ చేసే దొంగను అరెస్టు చేసి 2.50 లక్షల రూపాయిలు విలువ చేసే 4 బైకులను స్వాధీనం చేసుకున్నట్లు తిరుపతి రూరల్ ఎస్ఐ గోవిందు తెలిపారు. ఈ సందర్భంగా రూరల్ ఎస్ఐ చిన్న గోవిందు మాట్లాడుతూ జిల్లా ఎస్పి సుబ్బరాయుడు ఆదేశాల మేరకు చంద్రగిరి ఎస్డిపిఓ ప్రసాద్ పర్యవేక్షణలో తిరుపతి రూరల్ ఎస్ఐ చిన్న గోవిందు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందంగా ఏర్పడి ముద్దాయి కొణిదల తేజ (23) తిరుపతి రూరల్ మండలం వైకుంటపురం ఆర్చి సమీపంలో ముద్దాయిని ఎస్ఐ మూర్తి అరెస్టు చేసిన్నట్లు తెలిపారు. ముద్దాయి తిరుపతి రూరల్, వెస్ట్ , ఈస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలో మోటార్ సైకిల్‌లు దొంగతనం చేసి, తిరుపతి రూరల్ మండలం, గాంధీపురం గ్రామంలో కాపురమున్న అతని స్నేహితులైన వంశీ, దుర్గాప్రసాద్‌లకు మోటార్ సైకిల్‌లను అమ్మినాడని, వారు కూడా దొంగలిచిన మోటార్ సైకిల్‌లు అని తెలిసి కూడా తీసుకొని వాడుకుంటున్నారని ముద్దాయి తెలిపాడన్నారు. మిగత బైకులు అమ్మిన వారి దగ్గర నుండి స్వాధీనం చేసుకుని ముద్దాయిని రిమాండ్‌కు పంపామన్నారు.

## డాక్టర్ జిలాని భాషా బహిరంగ క్షమాపణలు చెప్పాలి

టీటీడీ పాలకమండలి సభ్యులు వైద్యం శాంతారాం

తిరుపతి హెల్త్, నవంబర్ 11, ప్రభాతవార్త

కడప పట్టణంలో రెండు రోజుల క్రితం డాక్టర్ జిలాని భాష ఓ మీడియా సమావేశంలో తమ కులాన్ని కించపరిచే విధంగా మాట్లాడటాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యులు వైద్యం శాంతారాం పేర్కొన్నారు. సోమవారం టిటిడి పాలకమండలి సభ్యులు శాంతారామ్ మీడియాతో మాట్లాడుతూ జిలాని భాష తమ నాయి బ్రాహ్మణ కుల జాతిని కించపరిచే విధంగా మాట్లాడటానికి తాము తీవ్రంగా ఖండిస్తున్నామని, ఒక వైద్య వృత్తిలో ఉంటూ జిలాని భాష తమ కులాన్ని కించపరిచే విధంగా మాట్లాడటాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటికైనా జిలాని భాష నాయి బ్రాహ్మణులకు బహిరంగంగా మీడియా సమావేశం ఏర్పాటు చేసి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

## పవిత్ర జాతరను రాజకీయం చేయొద్దు!

బియ్యపు మధుసూధనరెడ్డి

శ్రీకాళహస్తి,నవంబర్ 11 ప్రభాతవార్త

పవిత్రమైన శ్రీకాళహస్తి ఏడు గంగమ్మల జాతరను తాను అధికారంలో ఉన్నపుడు ప్రభుత్వం తరపున నిర్వహించుటకు జివో తెస్తే నేడు తెలుగుదేశం శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి జాతరను రాజకీయం చేస్తున్నారని మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం పార్టీకార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ మనం చేసే ప్రతి పనిని జనం చూస్తుంటారని తాను 20 సంవత్సరాల వరకు తిరుగులేకుండా పరిపాలిస్తామని భావించామని, కానీ జనం తీర్పును శిరసావహించాలన్నారు.రాజకీయ నాయకులు వేసే ప్రతి అడుగును జనం గమనిస్తూ ఎన్నికల్లో తీర్పు ఇస్తారనే విషయాన్ని విస్మరించరాదని మధుసూధనరెడ్డి అన్నారు.తాను ఎంఎల్‌ఏగా చేసిన మంచిపనుల కంటే అధికంగా చేయటానికి పోటీ పడాలి కానీ దేవుళ్ళ ఉత్సవాలను రాజకీయం చేయటం సారా సిండెకేట్‌లా ఉత్సవ కమిటిలను ఏర్పాటు చేయుటకు ప్రయత్నించటం శోచనీయం అన్నారు. జాతర సంప్రదాయాలను ఆచారాలను,ప్రతిష్టతను,పవిత్రతను దిగజార్చవద్దని మాజీ ఎంఎల్‌ఏ అన్నారు. విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు మాజీ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు,పఠాన్ ఫరీద్‌ఖాన్,ఉత్తరాజీ శరవణ కుమార్,మున్నారాయల్, పసల కృష్ణయ్య, శ్రీవారి సురేష్, సాగిరాజీ, పెరుమాళ్, విజయకుమార్‌రెడ్డి, కామివేంకటేశ్వర్లు, ప్రసాద్‌మేస్త్రీ, మునీర్,వయ్యాల మనోహర్‌రెడ్డి, ఆర్ట్ ముని, బాలిశేట్టిశేఖర్,కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన సదస్సులు

శ్రీకాళహస్తి నవంబర్ 11 ప్రభాతవార్త

నేడు సమాజంలో చోటు చేసుకుంటున్న నేరాలకు సంబంధించి విద్యార్థులకు అవగాహన కల్పించుటకు జిల్లా ఎస్‌పి సుబ్బరాయుడు ఆదేశాలతో స్థానిక డివైయస్‌పి నరసింహామూర్తి, సిఐ డి.గోపి సారధ్య లో మున్సిపల్ పరిధిలోని పాఠశాలలు,కళాశాలల్లో జూమ్ వీడియో కాన్ఫరెన్సు ద్వారా కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. సైబర్ నేరాలు, క్రైమ్, డ్రగ్స్,క్రైమ్ ఎగైనెస్ట్ ఉమెన్ అండ్ చిల్డ్రన్‌లపై సాగుతున్న ఆరాచకాలను,ఆఘాయిత్యాలను ఎలా ఎదుర్కొవాలనే అంశంపై వీడియో కాన్ఫరెన్సును నిర్వహించారు. ఎవరికైనా ఏదైనా సమాచారం తెలిస్తే డయల్ 112 లేదా తిరుపతి పోలీస్ కంట్రోల్ రూం వాట్స్‌ప్ నెంబర్ 8099999977కు సమాచారం ఇవ్వాలని కోరారు.

## పరశురామేశ్వరుని సన్నిధిలో ఉప కమీషనర్

శ్రీకాళహస్తిరూరల్ నవంబర్ 11 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని శివాలయాలకు భక్తుల తాకిడి పెరిగింది. సోమవారం ఏర్పేడు మండలంలోని చారిత్రక ప్రసిద్ధి చెందిన గుడిమల్లం పరశురామేశ్వరాలయానికి కర్నూల్‌లోని ఉప కమిషనర్, తిరుపతి ఆర్‌డిఓలు ఉదయంఅభిషేక సేవల్లో పాల్గొన్నారు. వారికి ఆలయ చైర్మెన్ బత్తల గిరిబాబు నాయుడు ఇఓ రామచంద్రారెడ్డిలు స్వాగతం పలికారు.కార్తీక మాసంలో సోమవారం శివాలయాలకు సంబంధించి భక్తులు తండోపతండాలుగా హాజరౌతున్నారు. ఈనేపథ్యంలో డెప్యూటీ కమిషనర్ గురుప్రసాద్, తిరుపతి ఆర్‌డిఓ రామమోహన్‌లు కుటుంబసభ్యులతో స్వామి వారిని దర్శించుకున్నారు.కాగా తిరుపతి ఆయుర్వేదిక్ డాక్టర్ రమేష్ స్వామి వారికి పూజలు,అభిషేకాలు జరిపారు.సుమారు వంద మంది భక్తులకు మధ్యాహ్నం సహాపంక్తిభోజనాలు కార్తీకమాసం సందర్భంగా ఏర్పాటు చేసారు.

## విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందించండి

.బొజ్జలబృందమ్మ

.తొట్టంబేడు, నవంబర్ 11 ప్రభాతవార్త

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించకపోతే కాంటాక్టర్‌ను మార్చివేయాలని ఎంఎల్‌ఏ మాతృమూర్తి బొజ్జలబృందమ్మ ఆదేశించారు. పట్టణంలోని తెలుగుగంగ కాలనీలో ఉన్న బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈసందర్భంగా వసతిగృహాలను సందర్శించిన ఆమె విద్యార్థినలకు భోజనం తయారుచేసే వంటశాలను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. పరిశుభ్రతకే తొలుత ప్రాధాన్యత ఇవ్వాలని ప్రిన్సిపల్, ఇక్కడ పనిచేస్తున్న వంటమాస్టర్‌లను ఆదేశించారు.ఆహారపదార్థాల నాణ్యతగా ఉండాలని కుళ్ళిపోయిన వాటితో వంటచేసినట్లు పిర్యాదులువస్తే సహించేది లేదన్నారు. ఆమెతో పాటు పలువురు తెలుగు మహిళలు, పాఠశాల విద్యార్థినులు, అధ్యాపకులు, పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్ ఆదిలక్ష్మికి పలువురు నివాళులు

.తొట్టంబేడు, నవంబర్ 11 ప్రభాతవార్త

తొట్టంబేడు మండల వైకాపా సీనియర్ నాయకుడు ఉన్నంవాసుదేవనాయుడు సతీమణి పొయ్య పంచాయతీ మాజీ సర్పంచ్ ఉన్నం.ఆదిలక్ష్మి(68) గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం నెల్లూరులో మృతిచెందింది. మృతదేహాన్ని పొయ్య స్వగ్రామానికి తీసుకుని వచ్చిన విషయం తెలియగానే మాజీ డిప్యుటీ సిఎం నారాయణస్వామి, తిరుపతి ఎంపి మద్దెలగురుమూర్తి, సత్యవేడు సమన్వయకర్త నూకతోటి రాజేష్‌లు ఆమె భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వాసునాయుడును పరామర్శించి కుటుంబసభ్యులను ఓదార్చారు. అంతేకాకుండా మండలంలోని వైకాపా సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, ఎంపిడిఓ, తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది పొయ్య గ్రామానికి చేరుకుని ఆమెకు నివాళులు అర్పించిన అనంతరం దహనక్రియలు నిర్వహించారు.

## సంఘ విద్రోహ చర్యలకు పాల్పడితే కఠిన శిక్షలు

వడమాలపేట, నవంబరు 11 ప్రభాతవార్త:

సంఘ విద్రోహ చర్యలకు ఎవరు పాల్పడినా కఠిన శిక్షలు ఉంటాయని పుత్తూరు డీఎస్పీ రవికుమార్ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వడమాలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు కలసి జూమ్ మీటింగ్‌లో పాల్గొన్నారు. సైబర్ నేరాలు, మహిళలపై జరుగుతున్న విద్రోహ చర్యలు, మత్తు పానీయాలు వల్ల యువత ఎలా పెడ దోవ పడుతున్నారో వివరిస్తూ, వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ఎవరు చట్ట వ్యతిరేకమైన పనులకు పాల్పడిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో వడమాలపేట ఎస్ఐ ధర్మారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కరుణ, నవనీతం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## శ్మశానికి దారి సౌకర్యం కల్పించండి

తొట్టంబేడు, నవంబర్ 11 ప్రభాతవార్త

మండలంలోని చోడవరం గ్రామ శ్మశానానికి దారి సౌకర్యం కల్పించాలని టిడిపి బిసి సెల్ తొట్టంబేడు మండల అధ్యక్షుడు పి.సురేంద్రయాదవ్ కోరారు. సోమవారంగ్రీవెన్స్‌డే సందర్భంగా ఆయన గ్రామస్తులతో కలసి ఆక్రమణలకు గురైన చోడవరం గ్రామ శ్మశాన దారికి సంబందించి తహశీల్దార్ యు.మధుసూధన్‌రావుకు వినతిపత్రం అందించారు. అధికారులు స్పందించి సమగ్ర సర్వేచేసి శ్మశానస్థలంకు దారి సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

## విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

విజయపురం, నవంబరు 11 ప్రభాతవార్త:

మండలంలోని ఇళ్ళత్తూరు ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు చంద్రయ్య, దొరస్వామి విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ఒకటి నుంచి 8 వరకు చదు వుతున్న 52 మంది విద్యార్థులకు పెన్నలు, పెన్సిల్, నోటు పుస్తకాలు వితరణగా అందించారు. కార్యక్రమ ంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమామహేశ్వరి, విద్యా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కౌలురైతులకు 20 వేలు ఇవ్వాలి

– కౌలు రైతు సంఘం నాయకులు

పుత్తూరురూరల్, నవంబరు 11 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్రసమితి పిలుపు మేరకు కౌలు రైతులకు 20 వేలు రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పుత్తూరు తహసీల్దార్‌కి పుత్తూరు రైతు సంఘం జిల్లా నాయకులు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గాలేరు–నగరి ప్రాజెక్టును పూర్తి చేసి రైతులకు నీరు అందించాలని కోరారు. వేణుగోపాలపురం సాగర్ ప్రాజెక్టును పూర్తి చేయాలని త్వరగా కోరారు. పుత్తూరు మార్కెట్ యార్డులోరైతులకు షెడ్యూల్ ఏర్పాటు చేయాలని రైతులకు రవాణా చేయడానికి అధ్వానంగా ఉన్న రోడ్లను బాగు చేయాలని తెలిపారు. 32 మంది విద్యార్థులు ప్రాణ త్యాగాలు ప్రజాప్రతినిధులు రాజీనామాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటుపరం తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు గోవిందస్వామి, రైతు సంఘం గోయింగ్ స్వామి రెడ్డి, కౌలు రైతు సంఘం నాయకులు మహేష్, భాస్కర్, కృష్ణారెడ్డి, కాశి తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన కాయగూరలు

ఎంపిడిఓ ఇందిర

రామచంద్రాపురం, నవంబర్ 11 ప్రభాతవార్త:

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన కాయగూరలు పండించవచ్చని ఎంపిడిఓ ఇందిర అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రకృతి వ్యవసాయశాఖ డిపిఎం షణ్ముగం ఆదేశాల మేరకు ఏర్పాటు చేయబడిన స్టాల్‌ను సోమవారం ఎంపిడిఓ ఇందిర, తహశీల్దార్ వెంకటరమణ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ రసాయనాలతో కూడిన కాయగూరలను పండించడం క్రమక్రమంగా తగ్గించుకుని రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు మళ్ళించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందడుగులు వేస్తున్నట్లు తెలిపారు. తహశీల్దార్ మాట్లాడుతూ సేంద్రీయ ఎరువులను వినియోగించడం మనపూర్వికుల నుండి సంప్రదాయంగా వస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో స్థానికులు స్టాల్స్‌లోని కాయగూరలను కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంటిలు రంగయ్య, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంత్ నగర్‌లో చోరీ .. పోలీసులకు ఫిర్యాదు

చంద్రగిరి, నవంబర్ 11 ప్రభాతవార్త:



స్థానిక ప్రశాంత్ నగర్‌కు చెందిన ఆదిని పూర్ణసాయితేజ నివాసంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. బాధితుడి ఫిర్యాదు మేరకు.. ఆదిని పూర్ణసాయితేజ బెంగుళూరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసుకుంటున్నాడు. తమ్ముడు ఎ.చక్రధర సాయి ఎన్‌టిపిసి ఒరిస్సాలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 6న తల్లిదండ్రులు తూపల్లి ప్రసన్నలక్ష్మి, వెంకటరమణ ఇంటికి తాళాలు వేసుకుని ఒరిస్సాకు వెళ్ళారు. సోమవారం వేకువజామున తమ ఇంటి పనిమనిషి వెళ్ళి చూడగా ఇంటితాళాలు పగులగొట్టి వుండటాన్ని గమనించి ఇరుగు పొరుగు వారికి చెప్పింది. దీంతో సమాచారం అందుకుని బెంగుళూరు నుండి వచ్చి ఇంటికి వెళ్ళి చూడగా బంగారు, వెండితో సహా కొంత మొత్తం నగదు దోచుకుపోయినట్లు వివరించారు. సిఐ సిబ్బరామిరెడ్డి బాధితుడి నుండి ఫిర్యాదు తీసుకుని దర్యాప్తు చేపట్టారు.

## ద్విచక్ర వాహనానికి అడ్డొచ్చిన ఆవు

వాహనం బోల్తా.. మహిళ మృతి

రామచంద్రాపురం, నవంబర్ 11 ప్రభాతవార్త:

తిరుపతి–పచ్చికాపల్లం ప్రధాన రహదారి పి.వి.పురం సమీపంలో సోమవారం ద్విచక్ర వాహనానికి ఆవు అడ్డు రావడంతో ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. వెదురుకుప్పం మండలం, గుంతలచేనుకు చెందిన కె.కమలమ్మ (26) తన భర్త సుబ్రమణ్యంతో కలసి తిరుపతికి వెళుతుండగా పి.వి.పురం వద్ద ఈ ప్రమాదం చోటుచేసుకున్నది. ఈ ప్రమాదంలో కమలమ్మ తలకు బలమైన కావడంతో స్థానికులు ఓ ప్రైవేటు వాహనంలో తిరుపతి రుయాకు తరలించారు. రుయాలో చికిత్స పొందుతూ ఆమె మృతి చెందారు. పోలీసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నెల్లూరు నుండి బెంగుళూరుకు ఇసుక

భారీ లారీ సీజ్, స్టేషన్‌కు తరలింపు

చంద్రగిరి, నవంబర్ 11 ప్రభాతవార్త:

పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా నుండి బెంగుళూరుకు జల్లెడపట్టిన నాణ్యమైన ఇసుకను 16 చక్రాల భారీ లారీలో అక్రమంగా తరలిస్తుండగా చంద్రగిరి పోలీసులు చెక్‌పోస్టు వద్ద స్వాధీనం చేసుకున్నారు. ఇసుక అక్రమ రవాణాపై సిఐ సుబ్బరామిరెడ్డి తమ సిబ్బందితో గట్టి నిఘా ఏర్పాటు చేశారు. పాకాలవారిపల్లి వద్ద చెక్‌పోస్టు వద్ద సోమవారం లారీని తనిఖీ చేస్తుండగా ఇసుక వెలుగుచూసింది. ఇసుక రవాణాకు తగిన అనుమతులు లేకపోవడంతో లారీని సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు.

## మల్లవరం హైవేపై గంజాయి బ్యాచ్ ఆగడాలు

లిఫ్ట్ కోసం వాహనాలను ఆపి దాడి చేస్తున్న వైనం, రూరల్ పోలీసులు పెట్రోలింగ్ చేయాలి..!

చంద్రగిరి, నవంబర్ 11 ప్రభాతవార్త:

చంద్రగిరి మండల పొలిమేరలోని మల్లవరం సర్కిల్ సమీపంలో సోమవారం 5 మంది గంజాయి బ్యాచ్ రెండు ఆటోలలో హల్‌చల్ చేస్తూ వాహనచోదకులను భయభ్రాంతులకు గురిచేశారని వాపోయారు. చంద్రగిరికి చెందిన ఓ వ్యక్తి తిరుపతి నుండి తన ద్విచక్ర వాహనంపై చంద్రగిరి వస్తుండగా గంజాయి మత్తులో ఓ యువకుడు లిఫ్ట్ కోసం ఆపాడు. ఈ ప్రాంతానికి చెందిన వ్యక్తి కావడంతో వాహనాన్ని వేగం తగ్గిస్తుండగా ఆ ఆకతాయి తన పిడికిలి బిగించి బలమైన పిడిగుద్దు ముఖంపై గుద్దడానికి చేతిని మారడంతో తృణప్రాయంలో తలదించుకుని అక్కడి నుండి పారిపోవాల్సిన దుస్థితి నెలకొన్నది. ఇక్కడ గంజాయి బ్యాచ్ ఆగడాలను గమనించిన వాహనచోదకులు బ్రతుకుజీవుడా అంటూ వెళ్ళారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవాల్సి వుంది. తిరుపతి కొర్లగుంటకు చెందిన యువకులుగా అనుమానిస్తున్న ఆయన స్థానికులకే పరిస్థితి ఈ విధంగా వుంటే మరి శ్రీవారి భక్తుల పరిస్థితి ఏమిటని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఓ కారును ఆపి బండరాళ్ళతో దాడి చేసిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. పొరబాటు ఎవరైనా వీళ్ళ చేతికి చిక్కి ప్రాణాలు పోగొట్టుకోకముందే తిరుపతి రూరల్ పోలీసులు మల్లవరం సర్కిల్ వరకుతరచూపెట్రోలింగ్ నిర్వహించి నిందితులను కఠినంగా శిక్షించాలని వాహనచోదకులు కోరుతు న్నారు.

## నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌కి స్వాగతం పలికిన టిడిపి నాయకులు

తిరుపతి హెల్త్, నవంబర్ 11, ప్రభాతవార్త :

ఆంధ్ర ప్రదేశ్ పారిశ్రామికీకరణ, యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడం కోసం విద్యా, ఐటీ సాంకేతిక శాఖా మంత్రి నారా లోకేష్ బాబుతో కలిసి అమెరికాలో పర్యటించి రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్,కి తెదేపా స్టేట్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు దశరథ వాసు,తెదేపా నాయకులు ఘన స్వాగతం పలికారు.

## ప్రజల నుంచి వచ్చిన వినతులను వెంటనే పరిష్కరించాలి

కమిషనర్ ఎన్. మౌర్య

తిరుపతి కార్పొరేషన్, నవంబర్ 11, ప్రభాతవార్త నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 38 వినతులను వచ్చాయని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. ప్రజల నుండి వచ్చిన వినతులు ఆయా విభాగాల అధికారులు వెంటనే పరిష్కరించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన వినతులు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 38 వినతులు అందాయని కమిషనర్ ఎన్. మౌర్య తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, తులసికుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్ రవి, డి.సి.పి. మహాపతి, వెటర్నరీ ఆఫీసర్ నాగేంద్ర, ఉద్యానవన శాఖ అధికారి హరికృష్ణ, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు రెడ్డి, డి . ఈ.లు, ఏ.సి.పి.లు, శానిటరీ సూపర్ వైజర్లు, తదితరులు ఉన్నారు.

## అపార్ నమోదు వేగవంతంగా పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్

తిరుపతి కార్పొరేషన్, నవంబర్ 11, ప్రభాతవార్త:

జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలలు, కళాశాలలోని విద్యార్థులకు అపార్ నమోదును త్వరితగతిన పూర్తి చేయాలని సంబందిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. సోమవారం సాయంత్రం జిల్లాలోని డిఈఓ, ఎంపిడిఓ లు, డిప్యూటీ ఈఓలు , ఎంఈఓ లతో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫెరెన్స్ నిర్వహించారు. ఈ సంధర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ నూతన విద్యా విధానం 2020 లో భాగంగా భారత ప్రభుత్వం ఒకే దేశం, ఒకే స్టూడెంట్ కార్డు పేరుతో ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలలు, కాలశాలలోని విద్యార్థులకు అపార్ (ఆటోమెటెడ్ పర్మనెంట్ అకాడమీ అకౌంట్ రిజిస్ట్రీ) నమోదు కార్యక్రమం ప్రవేశ పెట్టిందని దీని ద్వారా విద్యార్థులకు ప్రత్యేక 12 అంకెలు గల గుర్తింపు కార్డును అందించనున్నదని దీనితో విద్యార్థులకు ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని తెలిపారు. ఈ కార్డు ద్వారా విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, జెండర్, క్యూఆర్ కోడ్, 12 అంకెలతో కూడిన గుర్తింపు కార్డు నంబర్ అన్నీ కలిపి డిజిటల్ రూపంలో భద్రపరచడం జరుగుతుందన్నారు. ఒకటో తరగతి నుండి పదవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల వారి డేట్ అఫ్ బర్త్, పేరులో తప్పులుంటే జనన ధ్రువీకరణ పత్రం ఆధారంగా సరి చేసుకోవచ్చున్నారు ( ఈ వీడియో కన్ఫెరెన్స్ నందు డిఈఓ, డెప్యూటీఈవో, ఎంపిడి ఓలు, ఎంఈఓ లు తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## ఘనంగా ముగిసిన రాష్ట్ర స్థాయి ఘట్కా పోటీలు

న జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

రేణిగుంట, నవంబరు 11 ప్రభాతవార్త: రేణిగుంట జిల్లా పరిషత్ బాలికల ప్లస్ టు ఉన్నత పాఠశాలలో గత రెండు రోజులుగా జరుగుతున్న 68వ రాష్ట్ర స్థాయి ఘట్కా పోటీలు ఆదివారం ముగిశాయి. పలువురు క్రీడాకారులు జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను ఏజీఎఫ్ కార్యదర్శులు జయరామయ్య, ఎస్.బాబు, ప్రధానాచార్యులు విష్ణువర్ధని, స్టేట్ అబ్జర్వర్ ఏ.బాలశేఖర్ అందజేశారు. జాతీయ స్థాయికి ఎంపికైన క్రీడాకారులు డిసెంబరు మొదటి వారంలో ఢిల్లీలో ఆడనున్నారు. జాతీయ స్థాయిలో రాణించి ఆంధ్రప్రదేశ్‌కు మంచి పేరు తేవాలని పలువురు ఆకాంక్షించారు.

## సీపీఎం పార్టీ ఏర్పేడు, రేణిగుంట మండలాల కన్వీనర్‌గా హరినాథ్

రేణిగుంట, నవంబరు 11 ప్రభాతవార్త:

రేణిగుంట ఏర్పేడు మండలాల సీపీఎం పార్టీ కన్వీనర్‌గా రేణిగుంటకు చెందిన హరినాథ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు రేణిగుంట ఏర్పేడు మండలాల పార్టీ సభ్యులతో మొదటి ప్రాంతీయ మహాసభ ప్రారంభోత్సవం సోమవారం సీపీఎం కార్యాలయం వద్ద జరిగింది. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య అరుణ పతాకాన్ని ఎగురవేసి అఖిలభారత జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పాంచాలి నగర్‌లో సీనియర్ సీపీఎం నేత వెంకటరమణ ఇంటి వద్ద పార్టీ సభ్యులతో ప్రతినిధుల సభ కరిముల్లా అధ్యక్షతన జరిగింది. సీపీఎం పార్టీ రేణిగుంట–ఏర్పేడు మండలాల ప్రాంతీయ కమిటీ కన్వీనర్‌గా కొండ్రెడ్డి హరినాథ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా ఈశ్వరమ్మ, సత్యశ్రీ, సెల్వరాజు, ఎంపీటీసీ సభ్యురాలు రాజేశ్వరి, రంగయ్య, కరిముల్లా, బాలకృష్ణ, రాజేంద్ర, ఆహ్వానితులుగా సీనియర్ సీపీఎం నేత వెంకటరమణను సభ్యులంతా ఏకగ్రీవం చేశారు.

## క్రీడలు విద్యార్థులలో నాయకత్వపు లక్షణాలను పెంపొందిస్తుంది.

–డాక్టర్ ఆర్ శారద జయలక్ష్మి దేవి

తిరుపతి విద్య,నవంబర్ 11,ప్రభాతవార్త: వెంకటేశ్వర వ్యవసాయ కళాశాల తిరుపతి ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిధిలోని కళాశాలల మధ్య క్రీడలు సాహిత్య మరియు సాంస్కృతిక సమ్మేళనం 2024–25 ను ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీ ఉపకులపతి డాక్టర్ ఆర్ శారద జయలక్ష్మి దేవి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలు విద్యార్థులలో నాయకత్వపు లక్షణాలను పెంపొందించడానికి దోహదం చేస్తాయని,బృందంగా ఏర్పడి పని చేసే సంస్కృతిని,ఆరోగ్యకరమైన పోటీని పెంపొందించడానికి శారీరక,మానసిక దృఢత్వానికి బీజం వేస్తుందని తెలిపారు.అనంతరం శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ సిహెచ్ అప్పారావు మాట్లాడుతూ క్రీడలు మరియు సాంస్కృతిక పోటీలలో పాల్గొనడం ద్వారా విద్యార్థులు తమలోని ప్రతిభను ప్రదర్శించడానికి సరైన వేదిక అని తద్వారా విద

# గూడూరు డివిజన్

## సమతుల్య ఎరువుల పద్ధతిని పాటించాలి




డక్కిలి, నవంబరు 11ప్రభాతవార్త: వరి పంట సాగులో రైతులు సమతుల్య ఎరువుల యాజమాన్యం పాటించాలని తిరుపతి జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి శ్రీనివాస తెలిపారు. మండలంలోని కుప్పాయపాళెం గ్రామంలో సోమవారం వరిపంట సాగుపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ రైతులు నారు మడులు సాగు నుంచే తగు యాజమాన్య పద్ధతులు పాటించాలని చెప్పారు. డక్కిలి వ్యవసాయశాఖ అధికారి విజయభారతి మాట్లాడుతూ రబీ సీజన్‌లో వరి పంట సాగుచేస్తున్న రైతులు సమగ్ర సస్యరక్షణ చర్యలు సకాలంలో చేపట్టాలని వివరించారు. రైతులకు వ్యవసాయ సీజన్‌లో వ్యవసాయ సిబ్బంది అందుబాటులో ఉండి తగు సలహాలు,సూచనలు ఇవ్వడం జరుగుతుందని చెప్పారు.

## సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో పూజలు

బాలాయపల్లి, నవంబర్ 11 ప్రభాతవార్త : సుబ్రహ్మణ్య గ్రామంలో వెలిసి ఉన్న షణ్ముఖ సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో రెండవ కార్తీక సోమవారం సందర్భంగా అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. షణ్ముఖ సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో మహిళా భక్తులు దీపాలు వెలిగించి కొబ్బరికాయలు కొట్టి మొక్కలు తీర్చుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

## సూళ్లూరుపేటలో కార్తీక సోమవార వేడుకలు

సూళ్లూరుపేట, నవంబర్ 11 ప్రభాతవార్త : కార్తీక మాసం రెండవ సోమవారాన్ని పురస్కరించుకొని పట్టణంలోని శివాలయాల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేకులజాము నుంచే భక్తులు పెద్ద ఎత్తున ఆలయాలకు తరలివెళ్లి దీపాలు వెలిగించారు. పట్టణంలోని శ్రీనాగేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అభయ శంకర దేవస్థానంలో స్వామివారికి రుద్రాభిషేకం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. నాగేశ్వరస్వామి దేవస్థానం ప్రధాన అర్చకులు పెల్లేటి సునీల్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. అభయ శంకర దేవస్థానంలో ఆకుతోట రమేష్, నలజాం రమణయ్య పర్యవేక్షణలో పూజలతో పాటు భారీ అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

## సామాజిక అంశాలపై ఇంజనీరింగ్ విద్యార్థులకు అవగాహన

కోట, నవంబర్ 11 ప్రభాతవార్త : సామాజిక అంశాలపై ఇంజనీరింగ్ విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టి డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి అన్నారు. కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో సోమవారం సామాజిక అంశాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా ఈ సదస్సును డైరెక్టర్ విజయ కుమార్‌రెడ్డి, నోకియా సొల్యూషన్ ప్రతినిధి రాజశేఖర్‌లు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయకుమార్‌రెడ్డి మాట్లాడు తూ భావి ఇంజనీర్లు కేవలం సాంకేతిక పరిజ్ఞానంపైనే కాకుండా వారిలో సృజనాత్మకతను వెలికి తీసేందుకు సామాజిక అంశాల్లో చైతన్యపరచడం వంటి కార్యక్రమాలను చేయాలని కోరారు. నిర్దేశించుకున్న లక్ష్యసాధనకు పోటీ ఎదుర్కోవాల్సిందే అన్నారు. విజయాన్ని దక్కించు కోవాలంటే ఎన్నో సమస్యలను అధిగమించా లన్నారు. సరైన మార్గనిర్దేశం లేకుండా కొందరు మనోధైర్యం కోల్పోతు న్నారని తెలిపారు. ఇలాంటి సమస్యల నుంచి విద్యార్థులు బయట పడేందుకు తమ కళాశాలలో ఒక్కొక్క బ్రాంచిలో వినూత్న కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. వాటిపై అవగాహన కల్పించేందుకు విద్యార్థులకు ఇలాంటి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మెకానికల్ హెచ్‌ఓడి విక్రమ్‌కుమార్, కోఆర్డినేటర్లు ఎం.శ్రీనివాసులు, పంటా శ్రీహరిరెడ్డి, నాగేంద్ర, ఉదయ్‌కుమార్, కిషందర్, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మౌలానా అబ్దుల్ కలాం జయంతి వేడుకలు

గూడూరు, నవంబర్ 11 ప్రభాతవార్త : గూడూరు పట్టణంలోని చిల్లకూరు శేషమ్మ మున్సిపల్ హైస్కూల్లో సోమవారం జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా మహమ్మదీయన్ వెల్ఫేర్ నెట్వర్క్ ఆధ్వర్యంలో భారతదేశ మొట్టమొదటి విద్యా శాఖ మంత్రి మోలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ గౌరవ అధ్యక్షులు షేక్ రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చిన తర్వాత భారతదేశ మొట్టమొదటి విద్యాశాఖ మంత్రిగా విద్యా శాఖలో సంస్కరణలు తీసుకుని వచ్చి, భారతీయ విద్యా వ్యవస్థను పటిష్ట పరిచి 15 సంవత్సరాల వయస్సు వరకు నిర్బంధ విద్యా విధానాన్ని అమలుపరిచిన వారు అబుల్ కలాం ఆజాద్ అని కొనియాడారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నెట్వర్క్ ఫౌండర్,అధ్యక్షులు సిపిఎం కాలేషా,అధ్యక్షులు షేక్ మహబూబ్ బాషా, నెట్వర్క్ సలహాదారు అబ్దుల్ రహీం, పూర్వ అధ్యక్షులు, దర్గా కమిటీ అధ్యక్షులు రియాజ్ అహ్మద్, కార్యదర్శి షేక్ షాన్వాజ్ ,చిల్లకూరు మండల విద్యాశాఖ అధికారి రావూఫ్, హెచ్ఎం శ్రీనివాసులు, పిడి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక వసతులు కల్పించండి

సూళ్లూరుపేట, నవంబర్ 11 ప్రభాతవార్త : సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధి లోని ఆర్యభట్ట నగర్, విక్రమ్‌సారాభాయ్ నగర్, శ్రీవారి నగర్, శ్రీచెంగాళమ్మ టౌన్‌షిప్ ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించాలని శ్రీహరికోట రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ కె.చిన్నయ్యకు వినతిపత్రాన్ని అందజేశారు. శ్రీహరికోట రోడ్డులో వర్షపు నీరు, డ్రైనేజి నీరు కలిసి తాగేందుకు ఉపయోగించే నీటిని కలుషితం చేస్తున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో సుబ్రహ్మణ్యంరెడ్డి, కుమారస్వామి, సుదర్శనం, ఆదిశేఖర్, కనకరాజు, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాసరావు, సాంబశివయ్య తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు సాంకేతికత ఎంతో అవసరం

కోట, నవంబర్ 11 ప్రభాతవార్త : రైతులు డ్రోన్ వినియోగంపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఎంతో ఉందని ఎన్‌బికెఆర్ తృతీయ సంవత్సరం ఇంజనీరింగ్ చదువుతున్న ట్రిపుల్ ఈ విద్యార్థులు చెప్పారు. ఏడుగురు ఇంజనీరింగ్ విద్యార్థులు సొంతంగా డ్రోన్లు తయారు చేసి సోమవారం స్థానిక తహశీల్దార్ జయజయరావుకు, వ్యవసాయాధికారి నిరంజన్ కుమార్‌కు చూపించారు. విద్యార్థులు మాట్లాడుతూ దేశానికి కూలీలు కొరత ప్రధాన సమస్యగా మారిందని, దీన్ని అధికమించడానికి అన్నదాతలు డ్రోన్లు వినియోగం వైపు మొగ్గు చూపాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు వ్యవసాయ యాంత్రీకరణ పథకాలు ద్వారా 40 శాతం రాయితీ ఇస్తున్నట్లు చెప్పారు. 10 లీటర్లు సామర్థ్యం ఉన్న డ్రోన్ వ్యయం రూ.10 లక్షలు కాగా, కేంద్రప్రభుత్వం రూ.4 లక్షలు రాయితీ ఇస్తుందని తెలిపారు. బ్యాంకు రుణంగా రూ.5 లక్షలు ఇస్తారని తెలిపారు. అనంతరం పురుగు మందుల వాడకాన్ని నివారించి చీడపీడ ఉన్నచోట మాత్రమే పిచికారి చేసే విధానం ఈ డ్రోన్లు ద్వారా ఉపయోగపడుతుందని తెలిపారు.

## కేశవరంలో మధ్యాహ్న భోజన పథకం తనిఖీ

కోట, నవంబర్ 11 ప్రభాతవార్త : కోట మండలం కేశవరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఎంఇఓ మస్తానయ్య మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. మధ్యాహ్న భోజనంలో రాజీ పడకుండా నాణ్యతగా అందించాలని సూచించారు. ప్రభుత్వం విద్యార్థులకు ఎన్నో పథకాలను ప్రవేశపెడుతుందని తెలిపారు. చిన్నతనం నుంచే విద్యార్థులు ఇష్టపడి చదవాలని సూచించారు.

## జాతీయ విద్యా దినోత్సవం

తడ, నవంబర్ 11 ప్రభాతవార్త : తడ మండలం కారూరు పంచాయతీ పరిధిలోని కాసింగాడుకుప్పం ఎంపియూపి స్కూలులో సోమవారం జాతీయ విద్యా దినోత్సవం నిర్వహించారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జన్మదినం సందర్భంగా ఈ కార్యక్రమం జరిగింది. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి 7వ తరగతి విద్యార్థిని కుమారి శ్రీమతి మొదటి బహుమతి సాధించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ప్రధానోపాధ్యా యులు రఘురామయ్య మాట్లాడుతూ విద్యారంగానికి మౌలానా చేసిన సేవలను కొనియాడారు. ఉపాధ్యాయులు ఎస్‌డి కరిముల్లా, సుధాకర్, సుబ్రహ్మణ్యం, తిరుపతి విఎస్ఆర్ దాస్, సంధ్యాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

కోట, నవంబర్ 11 ప్రభాతవార్త : సైబర్ క్రైమ్‌పై కోట మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో సోమవారం పోలీసు అధికారులు విద్యార్థులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులు ఎక్కువగా ప్రలోభాలకు గురవుతున్నారని, వారికి అవగాహన కల్పించే దిశగా కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర డిజిపి తిరుమల రావు, జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు వర్చువల్ విధానంలో విద్యార్థులకు సైబర్ క్రైమ్, డ్రగ్స్, చిన్నారులపై జరుగుతున్న అత్యాచారాలు, అక్రమ రవాణా, బాల్య వివాహాలు వంటి నేరాలకు పాల్పడుతున్న వారికి కఠిన శిక్షణ విధించాలని, ఈ నేరాలకు పాల్పడుతున్న వారు భయపడేలా చట్టాలు, శిక్షలు ఉంటాయని పేర్కొన్నారు. చట్టాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాన్ కార్డు, ఆధార్‌కార్డు వంటి వివరాలతో పాటు ఓటిపిలను షేర్ చేయకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ వర్చువల్ విధానంలో ఎస్ఐ పవన్‌కుమార్, ప్రగతి కళాశాల విద్యాసంస్థల ఛైర్మన్ పసుపులేటి కిషోర్ పాల్గొన్నారు.

## తిరుపతి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునికి సన్మానం

దొరవారిసత్రం నవంబర్ 11 ప్రభాతవార్త : తిరుపతి జిల్లా దొరవారిసత్రం మండలం తల్లంపాడు ప్రాథమిక పాఠశాల నందు ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న వాటంబేటి శ్రీనివాసులు తిరుపతి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా జిల్లా కలెక్టరు చేతుల మీదుగా అవార్డు పొందిన విషయం తెలిసిందే. ఈ సంధర్భంగా సోమవారం తల్లంపాడు ప్రాథమిక పాఠశాల నందు ఉపాధ్యాయులు మరియు గ్రామస్తులు సమక్షంలో ఆత్మీయ సన్మాన కార్యక్రమం చేయడం జరిగింది.జాతీయ విద్యా దినోత్సవం(మౌలాన అబ్దుల్ కలాం) జయంతి సందర్భంగా తల్లంపాడు పాఠశాల విద్యార్థులకు విద్యా సామాగ్రిని అవార్డు గ్రహీత వాటంబెటి శ్రీనివాసులు అందిచారు. మండల విద్యాశాఖ అధికారి కృష్ణయ్య,ప్రధానోపాధ్యాయులు ఐ.రాంబాబు, ఏకొల్లు హైస్కూలు ప్రధానోపాధ్యాయులు నరసింహారావు,బిటిఎ రాష్ట్ర కార్యదర్శి రమేష్,యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు రాజశేఖర్,ఉపాధ్యయులు శేషయ్య, రవీంద్ర,మరియు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నెలవలను పరామర్శించిన వాకాటి

నాయుడుపేట టౌన్, నవంబరు 11 ప్రభాతవార్త: సూళ్ళూరుపేట నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ ఇన్‌చార్జి నెలవల సుబ్రమణ్యంను మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి సోమవారం ఆయన నివాసంలో పరామర్శించారు.నెలవల సుబ్రమణ్యం ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ చెన్నై విజయ హస్పిటల్‌లో చికిత్స చేయించుకొని నాయుడుపేట లోని ఆయన నివాసంలో విశ్రాంతి తీసుకొంటున్న విషయం తెలిసిందే. అయితే ఆ విషయం తెలుసుకొన్న మాజీ ఎమ్మెల్సీ, బిజేపి రాష్ట్రఉపాధ్యక్షుడు వాకాటి నారాయణరెడ్డి నెలవల సుబ్రమణ్యం నివాసానికి చేరుకొని ఆయనను పరామర్శించారు. ఆయన వెంట దేవారెడ్డి సుదాకర్‌రెడ్డి,ఎస్ జె జూవెలరి అధినేత పొట్టపూడి రాజేష్,తదితరులు ఉన్నారు.

## నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగివుండాలి : డిఎస్‌పి

నాయుడుపేట టౌన్, నవంబరు 11 ప్రభాతవార్త :సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాలపై విద్యార్థులు పూర్తిస్థాయిలో అవగాహన కలిగివుండాలని నాయుడుపేట డిఎస్‌పి చెంచుబాబు తెలిపారు. సోమవారం ఆయన ఆధ్వర్యంలో నాయుడుపేట పట్టణంలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సైబర్ క్రైమ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నాయుడుపేట డిఎస్‌పి చెంచుబాబు మాట్లడుతూ ఇటీవల కాలంలో సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలియజేశారు. ఆయన వెంట నాయుడుపేట ఎస్సై శ్రీహరి,పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

## రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

సూళ్ళూరుపేట, నవంబర్ 11 ప్రభాతవార్త : సూళ్ళూరుపేట పరిధిలోని కోటపోలూరు సమీపంలో రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. సోమవారం ఉదయం ఈ ఘటన జరిగినట్లు భావిస్తున్నారు. అయితే ఇతన్ని ఏ రైలు ఢీకొట్టిందో, ప్రమాదం ఎలా జరిగిందో తెలియరాలేదు. రైలు పట్టాలపై కట్‌డ్రాయర్‌తో పడి ఉన్న మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. స్థానికుల సమాచారంతో మృతదేహాన్ని సూళ్ళూరుపేట ప్రభుత్వాసుపత్రికి రైల్వే పోలీసులు తరలించారు.

## భూ సమస్యల సత్వరమే పరిష్కారం : తహసిల్దార్

బాలాయపల్లి, నవంబర్ 11 ప్రభాతవార్త : జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ నిర్వహించిన నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న తహసిల్దార్ శ్రీనివాసులు, డిప్యూటీ తహసిల్దార్ శిరీష. ప్రజా విజ్ఞప్తి జనంలో వచ్చిన వినతి పత్రాలు పరిశీలించి పరిష్కరిస్తామని తెలిపారు. ప్రజా విజ్ఞప్తుల పరిష్కార వేదికలు సమస్యలపై వచ్చిన వినతిపత్రాలను పరిశీలించి పరిష్కరిస్తామని తెలిపారు.

## ఆర్డీఓ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ కూరగాయలు

చిల్లకూరు, నవంబర్ 11 ప్రభాతవార్త : గూడూరు ఆర్డివో కార్యాలయంలో డిపిఎం షణ్ముగం ఆదేశాల మేరకు ఎన్ఎఫ్ఏ మార్కెటింగ్ మధు, ఎడిఏ గోపినాయక్, ఏఓ భవాని, రమేష్‌లు, ఎన్ఎఫ్ ఎంటి తిరుమల ఆధ్వర్యంలో గూడూరు మండలంలోని చిల్లకూరు మండలంలో ఎపిసిఎన్ఎఫ్ సిబ్బంది పురుగు మందులు వాడకుండా పండించిన కూరగాయలు, ఆకు కూరలను ఆర్డిఓ కార్యాలయం నందు ఏపిసిఎన్ఎఫ్ స్టాల్ ఏర్పాటు చేసి వినియోగ దారులకు ప్రతి సోమవారం విక్రయించడం జరుగుతుందన్నారు. అనంతరం వరి విత్తనాలకు బిజామృతంతో విత్తన శుద్ధి ఎలా చేయాలి అని రైతులకు డెమో చేసి చూపించారు. విత్తన శుద్ధి వలన ఉపయోగాలు తెలియజేశారు. పెంచలయ్య, పూర్ణిమ, ధనంజయ, నారాయణమ్మలు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి హాకి టోర్నమెంట్‌కు విద్యార్థి ఎంపిక

గూడూరు, నవంబర్ 11 ప్రభాతవార్త : జాతీయ స్థాయి హాకీ టోర్నమెంట్‌కు శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థి ఎంపికైయ్యారు. నెల్లూరు జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌లో అనకాపల్లి జిల్లాలోని నక్కపల్లిలో జరిగిన రాష్ట్ర స్థాయి హాకీ టోర్నమెంట్‌లో గూడూరు శ్రీ చైతన్య నుంచి ముగ్గురు విద్యార్థులు హేమంత్ సాయి, కరిమున్నీ సాతో పాటు ఆ జట్టు కెప్టెన్‌గా వ్యవహరించిన గణేష్ అనే విద్యార్థి పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున తొలి 11 మందితో మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని భోపాల్‌లో జరగబోయే జాతీయ హాకీ టోర్నమెంట్‌కు గూడూరు గణేష్ ఎన్నికైయ్యారు. అలాగే శ్రీ చైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ కోటా శ్రీనివాసులు, ఏజిఎం ఎన్. శ్రీకాంత్, గూడూరు ఎంఈఓ 2 కాంచన, జడ్పి బాయ్స్ హైస్కూల్ హెడ్మాస్టర్ భారతి, పిడి కరి ముల్లా, ఆ పాఠశాల డీన్ శ్రీహరిబాబు, హరి బ్రహ్మ యాదవ్, గాంధీ పిఈటిలు రూప, మహిత, ప్రైమరీ ఇన్చార్జి చందన, ప్రీ ప్రైమరీ ఇంచార్జి కిరణ్మయి తదితరులు పాల్గొని విద్యార్థిని అభినందించారు.

## పంచాయతీల అభివృద్ధిపై 13న శిక్షణ : ఎంపీడీవో

బాలాయపల్లి, నవంబర్ 11 ప్రభాతవార్త : 2024 25 సంవత్సరమునకు అన్ని గ్రామ పంచాయతీల ప్రణాళికల తయారీకి ఈనెల 13వ తేదీ శ్రీ శక్తి భవనంలో ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో డీజే వినీల్ కుమార్ తెలిపారు. శిక్షణలో జడ్పిటిసి ,ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచులు, కోఆప్షన్ సభ్యులు, మండల స్థాయి అధికారులు పాల్గొనాలని కోరారు.

## సైబర్ క్రైమ్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు

చిల్లకూరు, నవంబర్ 11 ప్రభాతవార్త : చిల్లకూరు మండలంలో ఉన్న ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలు కళాశాలలో సోమవారం జిల్లా ఎస్పీ. కలెక్టర్ ఆదేశాల మేరకు కళాశాలలో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు సైబర్ క్రైమ్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. సోమవారం చిల్లకూరు సబ్ ఇన్స్పెక్టర్ సురేష్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డ్రగ్స్, ఏటీఎం, ఫోన్ పే, ఆన్లైన్ మోసాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది. విద్యార్థులు పాల్గొన్నారు.

## కొండాపురంలో విద్యుత్ లైన్లు సరిచేయాలి

వాకాడు, నవంబర్ 11 ప్రభాతవార్త : వాకాడు మండలం కొండాపురం గ్రామంలో రెవెన్యూ పొలములోని విద్యుత్ లైన్లు సరిచేయాలని రైతులు గ్రామస్తులు ట్రాన్స్కో అధికారులను కోరుతున్నారు. విద్యుత్ లైన్లు తరచూ బ్రేకప్ ట్రబుల్ వల్ల రోజుకి ఒకటి, రెండుసార్లు వారం రోజులుగా నుంచి తెగిపోతున్నాయని దీనిపై విద్యుత్‌శాఖ అధికారులు పరిశీలించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. విద్యుత్ లైన్లు బ్రేకప్ వలన వర్షాకాలం సీజన్లో ఎలాంటి పరిస్థితులు సంభవిస్తాయని రైతులు భయం ఆందోళన చెందుతున్నారు.

## ఈనెల 18న గ్రామ సచివాలయాల వద్ద ఆందోళన

వెంకటగిరి, నవంబర్ 11 ప్రభాతవార్త : ప్రస్తుత కూటమి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు పేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు పట్టణాల్లో రెండు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు ఇస్తామని ఆ ఇళ్ళ నిర్మాణం కోసం ఐదు లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారని ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పి మురళి డిమాండ్ చేశారు. సోమవారం వెంకటగిరిలోని సిపిఐ కార్యాలయంలో వెంకటగిరి నియోజకవర్గ సమితి సమావేశం కృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేర్చాలని లేకుంటే గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి మధ్య పెద్ద తేడా ఏమీ కనిపించదని ఆయన అన్నారు. పేదల ఇళ్ల నిర్మాణానికి సిమెంటు, ఇసుక, ఇనుము, ఇటుక, కంకర ప్రభుత్వమే ఉచితంగా సరఫరా చేయాలన్నారు. నవంబర్ 18న ప్రతి నియోజకవర్గంలోనే అన్ని సచివాలయాలలో పేదలను సమీకరించి ఇళ్ల స్థలాల పైన పోరాటాలకు సిద్ధం కావాలని అలాగే రైతాంగ సమస్యల పరిష్కారం కోసం దేశవ్యాప్తంగా నవంబర్ 26వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే రైతు ఆందోళనలో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ సమావేశం సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి పీ బాలకృష్ణ,సమితి సభ్యులు కే అంకయ్య, జాన్, మునీంద్ర,పి.తులసమ్మ, ఎస్ ఢిల్లీ లు పాల్గొన్నారు.

## స్వర్ణముఖినదిలో గుర్తుతెలియని మృతదేహం

నాయుడుపేట టౌన్, నవంబరు 11 ప్రభాతవార్త : నాయుడుపేట పట్టణంలోని శివాలయం సమీపంలోని స్వర్ణముఖినదిలో గుర్తుతెలియని మృతదేహం పడివుండటాన్ని సోమవారం చిగురుపాడు విఆర్ఓ ఖాళీ వరప్రసాద్ గుర్తించి పోలీసులకు సమాచ్చారం అందించారు. విషయం తెలుసుకొన్న నాయుడుపేట ఎస్సై శ్రీహరి తనసిబ్బందితో కలిసి స్వర్ణముఖనది వద్దకు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం వరదనీటిలో పడి ఇక్కడకు కొట్టుకొని వచ్చివుండవచ్చునని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.మృతుడు వయస్సు 40సంవత్సరాలు కలిగి గుర్తు పట్టలుని విధంగా కుళ్ళిపోయి ఉందన్నారు. మృతదేహన్ని పంచనామ నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. నాయుడుపేట ఎస్సై శ్రీహరి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యార్థులకు డ్రగ్స్‌పై జూమ్ మీటింగ్

వాకాడు, నవంబర్ 11 ప్రభాతవార్త : వాకాడు లోని సోమవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల కళాశాల విద్యార్థులతో డ్రగ్స్ అవగాహనా పై జిల్లా కలెక్టర్, ఎస్పీ జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ఎస్పీ జూమ్ మీటింగ్ ద్వారా మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు సాంఘిక దురాచారాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రధానంగా డ్రగ్స్, గంజాయి, మహిళలు వేధింపులు, సైబర్ నేరాలుకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని, విద్యార్థులు వాటికి దూరంగా ఉండాలని జిల్లా కలెక్టర్, ఎస్పీ హితబోధ చేశారు. ఈ జూమ్ మీటింగ్‌లో వాకాడు సబ్ ఇన్స్పెక్టర్ నాగబాబు, కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పేట రైల్వే క్వార్టర్స్‌లో మంటలు!

నాయుడుపేట టౌన్, నవంబరు 11 ప్రభాతవార్త : నాయుడుపేట రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న రైల్వేక్వార్టర్స్‌లో సోమవారం మధ్యాహ్నాన సమయంలో హఠాత్తుగా మంటలు చెలరేగాయి. మంటలను గుర్తించిన స్థానికులు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం తెలియజేశారు. విషయం తెలుసుకొన్న ఫైర్‌స్టేషన్ ఎస్ఎఫ్ఓ శ్యాంబాబు తన సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు.ప్రమాదంలో ఎటువంటి ప్రాణా,ఆస్థి నష్టం జరగలేదన్నారు.

## కన్నుల పండువగా వైష్ణవ కోనేరులో లక్షదీపార్చన

శ్రీకాళహస్తి,నవంబర్ 11 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయం కార్తీక మాసంలో నాలుగు సోమవారాల్లో నాలుగు కోనేరుల్లో 'లక్ష దీపార్చన' కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. గతంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా నారద పుష్కరిణిలో మహాదీపం వెలిగించే సంప్రదాయం ఉండేది. అయితే ఈ ఏడాది నుంచి పట్టణానికి నలుదిక్కుల్లో వెలసిన ప్రధాన కోనేరుల్లో 'లక్ష దీపార్చనకు ఆదేశించారు. ఈ నేపథ్యంలో రెండవ సోమవారం పట్టణ నడిబొడ్డులోని వైష్ణవకోనేరులో ఏర్పాటు చేసారు. ఆలయ డెప్యూటి ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి దంపతులు హాజరుకాగా 'లక్ష దీపార్చనను' శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి సతీమణి బొజ్జల రిషితారెడ్డి దీపాలను వెలిగించే ముందు పూజలు జరిపారు.కోనేరులో ఆలయాధికారి టి.బాపిరెడ్డి సూచనలతో ఇంజనీరింగ్ అధికారులు ఇఇ మురళీధర్‌రెడ్డి, డిఇఇ శ్రీనివాసులు రెడ్డిలు పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. కోనేరు చుట్టూ సెక్యూరిటి సిబ్బందిని గట్టి బందోబస్తు ఏర్పాటు చేసారు. కోనేరు చుట్టూ, అలాగేకోన